తెలంగాణ జాతీయ దినపత్రిక

# ప్రజా మంటలు

సంపుటి : 4
సంచిక : 37
పేజీలు - 8
వెల- రూ 5 :00
prajamantalu.com

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

శుక్రవారం 30, జూన్-2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## ఎన్నికల్లో గెలుపు కోసం అధికార పార్టీల వ్యూహం

- జగనన్న పథకాలతో దూకుడు పెంచిన జగన్
- తెలంగాణలో బిఆర్ఎస్ ఒంటరి పోరాటం
- అన్ని వర్గాలకు పథకాలు రచిస్తున్న కెసిఆర్

ఇప్పటికీ ఎటూ తేలని చిన్న పార్టీల వైఖరి



7లో..

# నింగికెగిసిన తెలంగాణ ఉద్యమ కెరటం

- ఆగిన సాయిచంద్ ఉద్యమపాట
- ఉద్యమ బిడ్డ సాయిచంద్ హఠాన్మరణం
- అర్ధరాత్రి గుండెనొప్పితో ఆస్పత్రికి తరలింపు
- చికిత్స పొందుతూ తెల్లవారుజామునే కన్నుమూత
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం కెసిఆర్, కెటిఆర్, మంత్రులు
- గుర్రంగూడ ఇంటికి వెళ్లి నివాళి అర్పించిన కెసిఆర్



హైదరాబాద్,జూన్29(ప్రజామంటలు) :: తెలంగాణ ఉద్యమకారుడు, ప్రముఖ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ వీ. సాయిచంద్ హఠాన్మరణం చెందారు. 39 ఏండ్ల సాయిచంద్.. బుధవారం సాయంత్రం తన కుటుంబ సభ్యులతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా కారుకొండలోని తన ఫామ్‌హౌస్‌కు వెళ్లారు. అయితే అర్ధరాత్రి వేళ గుండెపోటు రావడంతో.. చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్‌లోని ఓ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ గచ్చిబౌలిలోని కేర్ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయనకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. 1984 సెప్టెంబర్ 20న వనపర్తి జిల్లా అమరచింతలో సాయిచంద్ జన్మించారు. పీజీ వరకు చదువుకున్న ఆయన.. విద్యార్థి దశ నుంచి కళాకారుడు,గాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో తన ఆటపాటలతో ప్రజల్లో ఉద్యమస్ఫూర్తిని రగిలించారు. రాష్ట్రం ఆవిర్భవించిన అనంతరం తెలంగాణ సాధించిన ప్రగతిని, ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను తన పాటలతో చాటిచెప్పారు. 2021, డిసెంబర్‌లో సాయిచంద్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. అదే నెల 24న ఆయన బాధ్యతలు స్వీకరించారు. సాయిచంద్ ఆకస్మిక మృతిని తెలుకున్న ఎంపీ సంతోష్ కుమార్.. కేర్ హాస్పిటల్‌కు వెళ్లారు. ఆయన మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రముఖ గాయకుడు సాయిచంద్ భౌతికకాయానికి మంత్రి కేటీఆర్ నివాళులు అర్పించారు. రంగారెడ్డి జిల్లా గుర్రంగూడలోని సాయిచంద్ నివాసానికి వెళ్లిన మంత్రి కేటీఆర్.. ఆయన పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. కేటీఆర్ వెంట మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రసమయి బాలకిషన్, టీఎస్ఎమ్మెస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఉన్నారు. అనంతరం మాట్లాడుతూ.. సాయిచంద్ అద్భుతమైన కళాకారుడని మిగతా 2లో..

## బిజేపి రాష్ట్ర అధ్యక్షునిగా కిషన్‌రెడ్డి

# చక్రం తిప్పిన అసంతృప్త నేతలు



- కాంగ్రెస్‌కు రెడ్లను దూరం చేసే ప్రయత్నం ?
- బిజేపి లో అంతర్గత పోరు నివారణకు యత్నం ?
- భారాస పై సంజయ్ రావత్ కీలక వ్యాఖ్యలు
- కాంగ్రెస్ లోకి వలసలను తగ్గించడానికి అడ్డుకట్టగా కిషన్ రెడ్డి ?

న్యూడిల్లీ జూన్ 28 (ప్రజా మంటలు బ్యూరో) తెలంగాణ బిజేపిలో రాబోయే వారం పది రోజులలో అనూహ్యమైన మార్పులు జరుగనున్నాయనే ప్రచారం ఊపందుకోంది. ఆదివారం నాటి జాతీయాధ్యక్షుని నాగర్ కర్నూల్ సభ, ఇటీవలి బిజేపి అసంతృప్త నేతల డిల్లీ పర్యటన నేపథ్యంలో పార్టీలో అధ్యక్షుని మార్పుతో సహా, మరికొన్ని కీలలక మార్పులు చేయాలని కేంద్ర నాయకత్వం నిర్ణయించుకొందనే ప్రహకారం ఊపందుకోంది. రాష్ట్ర బిజేపి అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ ను మార్చి, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి రాష్ట్ర పగ్గాలు అందించనున్నట్లు తెలుస్తుంది. రాష్ట్రంలో వెలమ వర్గం తరువాత, రాజకీయంగా, ఆర్థికంగా బలంగా ఉన్న రెడ్డి వర్గానికి చెందిన కిషన్ రెడ్డికి నాయకత్వం అప్పజెప్పితే, పార్టీ బలపడుతుందేనదే కేంద్ర నాయకత్వపు ఆలోచనగా కనబడుతుంది.

### బిజేపి లో అంతర్గత పోరు నివారణకు యత్నం ? :

తెలంగాణ బిజేపి లో పెరిగిన అంతర్గత పోరును తగ్గించడానికి, రాబోయే ఎన్నికల్లో గౌరవ ప్రదమైన సీట్లు సంపాదించాలంటే, ఇప్పుడున్న నాయకుల వలసలు ఆపాలన్నా, ప్రస్తుత బిజేపి అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ ను మార్చక తప్పదనే విషయంలో బిజేపి కేంద్ర నాయకత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు డిల్లీ వర్గాలలో చర్చించుకొంటున్నారు. గత వారం రోజులుగా, బిజేపి నాయకులు దిల్లీలో జరిపిన మంత్రాంగం ఒక కొలిక్కి వచ్చినట్లు, క్షేత్ర స్థాయి పరిస్థితులను బిజేపి కేంద్ర నాయకత్వం పూర్తి స్థాయిలో అవగాహన చేసుకొన్నట్లుగా ప్రచారం జరుగుతుంది. అమిత షా ఖమ్మం సభ వాయిదా పడడానికి, అసంతృప్త నేతలు సభకు డుమ్మాకొడతారనే భయమే కారణంగా చెపుకొంటున్నారు. అలాగే ఆదివారం జరిగిన బిజేపి జాతీయ అధ్యక్షులు జయప్రకాష్ నడ్డా నాగర్ కర్నూల్ సభకు ఏతల రాజేందర్, కోమటి రెడ్డి రాజగోపాల్ లాంటి అనేక మంది బడా నాయకులు డుమ్మా కొట్టడం కూడా అధినాయకత్వం తీవ్రంగా పరిగణిస్తుంది. గత సంవత్సర కాలంగా రాష్ట్ర పార్టీ అధ్యక్షుని మార్చాలని రాష్ట్ర నాయకులు చేస్తున్న విజ్ఞప్తులను ప్రక్కకు పెట్టిన కేంద్ర నాయకత్వం, ఇప్పుడు రాష్టయంలోని పరిస్థితులను క్షుణ్ణంగా అర్థం చేసుకొనట్లు చెప్పుకొంటున్నారు. ఏతల రాజేందర్ కు ఎన్నికల ప్రచార కమిటీ ఛైర్మన్ పదవి ఇస్తారని జరిగిన ప్రచారం కూడా ఉత్తదేనని తెలిపోవడంతో, తెరాస, కాంగ్రెస్ అసంతృప్త నేతలు బిజేపి లోకి రావాలనుకొన్నా, పార్టీలోని అంతర్గత కుమ్ములాటల వల్ల వెనిక్కి వెళ్లిపోయారని, కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాదించడంతో, మళ్ళీ కాంగ్రెస్ పార్టీలో ఆశలు చిగురించాయని, అలాగే, బిజేపిలో నిరాశ వెల్లువెత్తుతుందనే ప్రచారంతో బిజేపి నాయకులు, మిగతా 2లో..

## దేశాన్ని మతపరంగా విభజించే కుట్ర

### ప్రధాని ఉమమడి పౌరస్మృతిపై స్టాలిన్ ఆగ్రహం

చెన్నై,జూన్ 29 : దేశంలో ఉమ్మడి పౌర స్మృతి అమలు చేయాల్సి అవసరం ఉందని ప్రధాని మోదీ పేర్కొనడంపై తమిళనాడు సీఎం స్టాలిన్ ఘాటుగా స్పందించారు. దేశంలో మతపరమైన ఘర్షణలను సృష్టించేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని, ఎన్నికల్లో నెగ్గేందుకు ప్రజల్ని ఆయన గందరగోళంలోకి నెడుతున్నారని స్టాలిన్ విమర్శించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలే గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు. పాట్నాలోని జరిగిన విపక్షాల భేటీ తర్వాత ప్రధాని మోదీ భయపడ్డారని, అందుకే ఆయన కుటుంబ రాజకీయాల గురించి మాట్లాడినట్లు స్టాలిన్ తెలిపారు. మాజీ సీఎం కరుణానిధి తనను కేవలం ఓ కుమారుడిలా చూడలేదని, ఆయనకు పార్టీ కార్యకర్తలు అంతా కుమారులే అని స్టాలిన్ పేర్కొన్నారు.

## వార్తల్లో నిలుస్తున్న ఢిల్లీ మెట్రో

### ఇద్దరు ప్రయాణికుల ఘర్షణ వీడియో వైరల్

న్యూఢిల్లీ,జూన్ 29 : కొన్ని అసభ్యకర ఘటనలతో ఇటీవలే ఢిల్లీ మెట్రో తరచూ వార్తల్లో నిలిచిన విషయం తెలిసిందే. అసభ్యకర చేష్టలు, ముద్దుసీన్లు, డ్యాన్స్ రీల్స్ వంటి వీడియోలు చర్చకు దారితీశాయి. తాజాగా మరో వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది. అయితే ఈ సారి ఇద్దరు ప్రయాణికుల మధ్య తీవ్రమైన ఘర్షణ చోటు చేసుకుంది. బుధవారం తెల్లవారుజామున రద్దీ రైల్లో ఇద్దరు ప్రయాణికులు వాగ్వాదానికి దిగారు. నిల్చోడానికి కూడా చోటు లేని రైలులో ఒకరికొకరు దూషించుకుంటూ కొట్టుకున్నారు. దీంతో ఇతర ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కొందరు వీరి మధ్య ఘర్షణను అడ్డుకునే ప్రయత్నం చేశారు.

# భారత అంతర్గ వ్యవహారలపై ఒబామా విపరీత వ్యాఖ్యలు

- అతడో ప్రైవేట్ వ్యక్తని అంటూ శ్వేతసౌధం ఖండన
- ఒబామా తీరును దుయ్యబట్టిన రాజ్‌నాథ్, నిర్మలా సీతారామన్



వాషింగ్టన్,జూన్ 29 : భారత దేశంలో మైనారిటీల రక్షణ గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాను అమెరికా ప్రభుత్వం సున్నితంగా పక్కనబెట్టింది. ఆయన పట్ల సమున్నత గౌరవం ఉన్నప్పటికీ, ఆయన ఓ ప్రైవేటు వ్యక్తి అని, శ్వేత సౌధంతో ఆయనకు సమన్వయం లేదని తెలిపింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటీవల అమెరికా ప్రభుత్వ అతిథిగా సమున్నత గౌరవం పొందుతూ ఆ దేశంలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ దేశాధ్యక్షుడు జో బైడెన్ దంపతులు అత్యంత ఆత్మీయతతో మోదీని ఆహ్వానించి, గౌరవించారు. జూన్ 22న వైట్ హౌస్ సౌత్ లాన్‌లోకి బైడెన్ అత్యంత గౌరవ, మర్యాదలతో మోదీని ఆహ్వానించారు. అదే రోజు బరాక్ ఒబామా ఓ టీవీ చానల్‌తో మాట్లాడుతూ, మెజారిటీ హిందూ ఇండియాలో ముస్లిం మైనారిటీల రక్షణ గురించి మోదీతో బైడెన్ మాట్లాడాలన్నారు. తాను మోదీతో మాట్లాడి ఉంటే, తన వాదనలో కొంత భాగం భారత దేశంలో మైనారిటీల హక్కుల గురించే ఉంటుందన్నారు. దేశంలోని మైనారిటీల హక్కులను భారత దేశ ప్రధాన మంత్రి కాపాడకపోతే, భారతదేశం విడిపోయే అవకాశం బలంగా ఉంటుంది. ఈ విస్తృత అంతర్గత సంఘర్షణలు 'ముస్లిం ఇండియా', 'హిందూ ఇండియాల ప్రయోజనాలకు విరుద్ధం అని అన్నారు. ఒబామా వ్యాఖ్యలు మన దేశంలో రాజకీయ ప్రకంపనలు సృష్టించాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ఆయనను తీవ్రంగా విమర్శించారు. ముస్లింలు అధికంగా ఉన్న ఆరు దేశాలపై ఒబామా నేతృత్వంలోని అమెరికా బాంబులు కురిపించిందని నిర్మల సీతారామన్ గుర్తు చేశారు. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ స్పందిస్తూ, భారత దేశంలోనే చాలా మంది హుస్సేన్ ఒబామాలు ఉన్నారని, అలాంటివారిపై అస్సాం పోలీసులు చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఓ జాతీయ పత్రిక శ్వేత సౌధం సీనియర్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌ను ఇంటర్వ్యూ చేసింది. ఆ అధికారి ఆ పత్రికకు తెలిపిన వివరాల ప్రకారం, ప్రధాని మోదీతో ప్రతి అంశాన్ని బైడెన్ ప్రస్తావించారు. అదేవిధంగా మోదీ కూడా బైడెన్‌తో ప్రతి అంశం గురించి మాట్లాడారు. అయితే ఈ సంభాషణ గౌరవప్రదంగా, మిగతా 2లో..

## జెడ్డా అమెరికన్ కాన్సులేట్ పై దాడి


### ఇద్దరిని కాల్చివేసిన సాయుధదళాలు

జెడ్డా,జూన్ 29 : జెడ్డాలోని అమెరికన్ కాన్సులేట్ పై దాడి చేసిన సాయుధుడితోసహా ఇద్దరు వ్యక్తులు బుధవారం సాయంత్రం భద్రతా దళాల ఎదురుకాల్పులలో మరణించినట్లు సౌదీ గెజిట్ దినపత్రిక గురువారం తెలిపింది. జెడ్డాలోని అమెరికన్ కాన్సులేట్ పై దాడి చేసిన సాయుధుడు భద్రతా దళాల ఎదురుకాల్పులలో మరణించగా కాన్సులేట్‌కు భద్రతా విభాగంలో పనిచేస్తున్న నేపాలీ కార్మికుడు ఒకరు ఎదురుకాల్పులలో తీవ్రంగా గాయపడి మరణించినట్లు అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. ఈ సంఘటన పూర్వాపరాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు మక్కా పోలీసులు తెలిపారు. బుధవారం సాయంత్రం 6.45 గంటల ప్రాంతంలో జెడ్డాలోని అమెరికన్ కాన్సులేట్ భవనం సమీపంలో చేతిలో గన్‌తో కారు దిగిన ఒక వ్యక్తి అక్కడ విధి నిర్వహణలో ఉన్న భద్రతా సిబ్బంది కాల్పులు జరిపేందుకు ప్రయత్నించగా పరిస్థితికి అనుగుణంగా భద్రతా సిబ్బంది స్పందించినట్లు పోలీసులు తెలిపారు.

## తెలంగాణ ఐసెట్ ఫలితాల వెల్లడి

వరంగల్,జూన్29 :తెలంగాణ ఐసెట్ ఫలితాలను వెల్లడయ్యాయి. హనుమకొండ కాకతీయ యూనివర్సిటీలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, టీఎస్ఐసీఈటీ చైర్మన్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వీ వెంకట రమణ, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఎస్కే మహమూద్, టీఎస్‌సీహెచ్ఈ సెక్రెటరీ శ్రీనివాసరావు విడుదల చేశారు. ఐసెట్‌లో నూకల శరణ్‌కుమార్ అనే విద్యార్థి మొదటి ర్యాంకు సాధించారు. సాయి నవీన్, రవిజేత వరుసగా రెండు, మూడు ర్యాంకులు సాధించారు. ఎంబీఏ, ఎంసీఏకోర్సుల్లో ప్రవేశానికి మే 26, 27 తేదీల్లో తెలంగాణలో 16, ఏపీలోని నాలుగు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. 70,900 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

## ప్రజానాడి





# తెలంగాణలో మళ్లీ బిఆర్ఎస్‌దే అధికారం

- 99 సీట్లతో హ్యాట్రిక్ విజయం కొట్టబోతున్నాం
- గత సిఎంలకు కెసిఆర్ పాలనకు ఎంతో తేడా ఉంది
- అన్నిరంగాల్లో అభివృద్ధి లక్ష్యంగా కెసిఆర్ పాలన
- క్రెడాయ్ కార్యాలయ ప్రారంభోత్సవంలో మంత్రి కెటిఆర్



హైదరాబాద్,జూన్29 : తెలంగాణలో మరో ఐదు నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నిక ల్లో బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారాన్ని దక్కించు కుంటుందని మంత్రికే టీఆర్ ధీమా వ్యక్తం చేశారు. మొత్తంగా 99 స్థానాల్లో విజయం సాధిస్తామన్నారు. హ్యాట్రిక్ విజయం ఖాయమని అన్నారు.

# రానున్న ఎన్నికలు లక్ష్యంగా మోడీ వ్యూహాలు

- పార్టీని విజయతీరాలకు చేర్చేలా కీలక నిర్ణయాలు
- ఆయా రాష్ట్రాల్లో గెలుపు లక్ష్యంగా ప్రణాళికలు
- అర్ధరాత్రి నడ్డా, అమిత్ షాలతో అంతరంగిక చర్చలు

న్యూఢిల్లీ,జూన్ 29(ఆర్ఎన్ఎ): రానున్న లోక్‌సభ ఎన్నికలకు భారతీయ జనతా పార్టీని సమరోత్సాహంతో ముందుకు నడిపేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సన్నాహాలు చేస్తున్నారు. ఆయన ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలతో బుధవారం రాత్రి చర్చలు జరిపారు. కేంద్ర మంత్రివర్గంలోనూ, పార్టీ సంస్థాగత విభాగాల్లోనూ మార్పులు, చేర్పులు జరగబోతున్నాయనే ఊహాగానాల నడుమ ఈ చర్చలు జరిగాయి. ఈ ఏడాది చివరిలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ తదితర రాష్ట్రాల శాసనసభ ఎన్నికలు జరగబోతున్నాయి. అదే విధంగా 2024లో లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయి. ఈ అన్ని ఎన్నికల్లో పార్టీ సర్వసన్నద్ధంగా, సమరోత్సాహంతో దూసుకెళ్లాలనే లక్ష్యంతో ప్రభుత్వంలోనూ, జాతీయ, రాష్ట్ర స్థాయుల్లోనూ మార్పులు జరగబోతున్నాయని కొన్ని రోజుల నుంచి ఊహాగానాలు ప్రచారమవు తున్నాయి. మోదీ అమెరికా పర్యటనను విజయవంతంగా ముగించుకుని, తిరిగి వచ్చిన వెంటనే పార్టీ పట్ల దృష్టి సారించారు. మోదీ మంగళవారం మధ్య ప్రదేశ్‌లోని భోపాల్‌లో వందే భారత్ రైళ్లను ప్రారంభించిన అనంతరం బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.



ఉమ్మడి పౌర స్మృతి అవసరం చాలా ఉందని నొక్కి చెప్పారు. బీజేపీ ఎన్నికల ప్రణాళికలో దీని గురించి ప్రస్తావించిన సంగతి తెలిసిందే. 2024 లోక్‌సభ ఎన్నికలతో పాటు రాబోయే పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా బీజేపీ ప్రణాళికను సిద్ధం చేసింది. మైక్రో మేనేజ్‌మెంట్ కోసం మెగా ప్లాన్ సిద్ధం చేసింది. పార్టీ పని తీరును

# రానున్న ఎన్నికలు లక్ష్యంగా మోడీ వ్యూహాలు

(మొదటిపేజీ తరువాయి)

విభాగాలుగా విభజించింది. ఇందుకోసం బీజేపీ ఉత్తర ప్రాంతం, దక్షిణ ప్రాంతం, తూర్పు ప్రాంతాన్ని నిర్ణయించింది. జులై 6, 7, 8 తేదీల్లో దేశంలోని వివిధ ప్రాంతాల్లో పార్టీ నేతలతో బీజేపీ అధ్యక్షుడు జేపి నడ్డా సమావేశం కాబోతున్నారు. ఈక్రమంలోనే జులై 6వ తేదీన ఈస్ట్ రీజియన్, 7న నార్త్ రీజియన్, 8న సౌత్ రీజియన్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మండల, రాష్ట్ర ఇంఛార్జీలతోపాటు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, స్థానిక మంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, జాతీయ కార్యవర్గ సభ్యులు హాజరవుతారని బీజేపీ నాయకులు చెబుతున్నారు. జులై 6వ తేదీన గౌహతిలో ఈస్ట్ రీజియన్ సమావేశం జరగనుంది. ఇందులో బిహార్, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, అసోం, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, మేఘాలయ, త్రిపుర రాష్ట్రాల నుంచి పార్టీతో సంబంధం ఉన్న వ్యక్తులు సమావేశంలో పాల్గొంటారు. జులై 7వ తేదీన ఢిల్లీలో ఉత్తర ప్రాంత సమావేశం జరగనుంది. ఇందులో జమ్మూ-కశ్మీర్, లడఖ్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, చండీగఢ్, రాజస్థాన్, గుజరాత్, డామన్ దయ్యూ-దాదర్ నగర్ హవేలీ, మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ, హర్యానాకు చెందిన బీజేపీ నేతలు పాల్గొంటారు.జులై 8వ తేదీన హైదరాబాద్‌లో సౌత్ రీజియన్ సమావేశం జరగనుంది. ఇందులో కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ముంబై, గోవా, అండమాన్ నికోబార్, లక్షద్వీప్ పార్టీల అధికారులతో చర్చలు జరుపుతారు. ప్రధాని నరేంద్ర మోదీ నివాసంలో బీజేపీ భేటీలో 2023 చివరలో జరగనున్న మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలపై చర్చ జరిగినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, బీజేపీ ఆర్గనైజేషన్ లీడర్ బీఎల్ సంతోష్



పాల్గొన్నారు. అయితే సంస్థలో పునర్వ్యవస్థీకరణకు సంబంధించి మేధోమథనం తర్వాత ప్రధాని మోదీతో ఈ సమావేశం జరిగిందని, ఇలాంటి పరిస్థితిలో పార్టీలో చాలా మార్పులు జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది జనవరి నాటికి తెలంగాణ, మిజోరం, ఛత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ అసెంబ్లీల గడువు ముగియనుంది. ఈ ఏడాది చివరి నాటికి ఈ ఐదు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలోనే బీజేపీ నేతలు.. ఎక్కువగా ఈ ఐదు రాష్ట్రాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. గెలుపే లక్ష్యంగా తరచుగా పర్యటనలు చేస్తున్నారు. ముఖ్యంగా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నెలలో రెండుసార్లు ఆయా రాష్ట్రాలకు వెళ్లి వస్తున్నారు.

# తెలంగాణలో మళ్లీ బిఆర్ఎస్‌దే అధికారం



ఈ తొమ్మిదేళ్లలో ప్రజలు చూసింది కేవలం ట్రైలరేనన్నారు. కేసీఆర్ ఆలోచనల్లో ఇంకా చాలా ప్రణాళికలు ఉన్నాయన్నారు. నానక్ రామ్ గూడలో క్రెడాయ్ కార్యాలయాన్ని కేటీఆర్ ప్రారంభించారు. హైదరాబాద్ ఎంతో అభివృద్ధి చెందిందని.. ద్వితీయ శ్రేణి నగరాల్లో 50వేల ఐటీ ఉద్యోగాలను సృష్టించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నానని తెలిపారు. ఈ సందర్భంగా గత ముఖ్యమంత్రులతో పోలిస్తే కేసీఆర్ ఎంత భిన్నంగా పరిపాలించారో విశ్లేషించారు. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రులుగా పని చేసిన చంద్రబాబు, వైఎస్ఆర్.. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మధ్య ఉన్న తేడా ఏంటో మున్సిపల్ మంత్రి కేటీఆర్ వివరించారు. చంద్రబాబు ఐటీ, బిజినెస్ రంగాలను ముందుకు నడిపించారు. తనను తాను ఒక సీఈవోగా అభివర్ణించుకునే వారన్నారు. వైఎస్ఆర్ రైతులు, సంక్షేమం, పేదలపై దృష్టి పెట్టారు. వారిద్దరూ కేవలం కొన్ని రంగాలనే ఎంచుకొని రాష్ట్రాన్ని పాలించారున్నారు. కానీ, సీఎం కేసీఆర్ తెలంగాణలో ఐటీ, ఫార్మా రంగాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటూనే.. మరో వైపు వ్యవసాయాన్ని అగ్రగామిగా నిలిపారన్నారు. రైతులు, ప్రజల సంక్షేమాన్ని కూడా ఆయన మారువలేదని మంత్రి కేటీఆర్ క్రెడాయ్ సభ్యులకు తెలిపారు. అన్ని వర్గాల వారి సంక్షేమానికి కేసీఆర్ పని చేసినందున వచ్చే ఎన్నికల్లో ఆయన మరోసారి గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 24 గంటల కరెంటు ఇస్తున్నాము. నీళ్ల బాధ తీరింది. ఎండాకాలంలో కూడా చెరువులు మత్తళ్లు దుంకుతున్నాయిన కేటీఆర్ చెప్పారు. 1940లో కట్టిన అప్పర్ మానేరు కోసం రైతులు హైదరాబాద్ వరకు పాదయాత్రలు చేసిన రోజులు ఉన్నాయి. కానీ ఇప్పుడు ఆ ప్రాజెక్టు ఎండాకాలంలో కూడా నిండు కుండలా ఉందని చెప్పారు. ఇలాంటి మార్పులు రావాలంటే నాయకుడిలో చిత్తశుద్ధి, అకుంఠిత దీక్ష ఉండాలని మంత్రి కేటీఆర్ అన్నారు. 67 ఏళ్లలో జరగని అభివృద్ధి 9 ఏళ్లలోనే సాధ్యపడిందంటే అందుకు సీఎం కేసీఆర్ దార్శనికతే కారణమని మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ నగరం నాది అని చెప్పుకోవడానికి మనమే కాకుండా, మన పిల్లలు కూడా గర్వ పడుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో ఎన్నో అనుమానాలు, అపోహలు ఏర్పాడ్డాయి. ముఖ్యంగా నిర్మాణ రంగంలో ఉన్న వాళ్లు చాలా కంగారు పడ్డారు. 10 ఏళ్ల క్రితం ఇందిరా పార్క్ వద్ద పారిశ్రామికవేత్తలు ధర్నా చేశారు. పవర్ హాలీడేలు పెడితే మేము ఎలా బతకాలి, మా కార్మికులకు ఎలా ఉపాధి దొరుకుందని ఆవేదన చెందారు. ఒక వైపు రైతుల ధర్నాలు. మోటార్లకు కరెంటు కావాలని.. మరోవైపు నీళ్ల గోస ఉండేది. అప్పట్లో ఊర్లలోకి పోవాలంటే భయమేస్తుండేది. కరెంటు, నీళ్లకు కూడా ఈ ప్రాంతం చాలా ఇబ్బంది పడిందని మంత్రి కేటీఆర్ గుర్తు చేశారు. సాయిచంద్ మరణంతో కార్యక్రమం రద్దు చేయాలనుకున్నామని.. కానీ తప్పనిసరి పరిస్థితుల్లో కార్యక్రమానికి హాజరయ్యానని కేటీఆర్ తెలిపారు. సాయిచంద్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు.

# నింగికెగిసిన తెలంగాణ ఉద్యమ కెరటం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పనిచే శారని వెల్లడించారు. సాయిచంద్ మరణం తీరని లోటని తెలిపారు. ఉద్యమంలో పాటల ద్వారా అందరిని ఏకం చేశారన్నారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోకుండా పాటలు పాడారని చెప్పారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్.. కూడా గుర్రంగూడలోని సాయిచంద్ నివాసానికి వెళ్లి భౌతిక కాయానికి నివాళి అర్పించారు. సాయిచంద్ భౌతికకాయానికి నివాళులు అర్పించారు. మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, హరీస్ రావు, ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు వెంటరాగా సాయిచంద్ భౌతిక కాయానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సాయిచంద్ మరణంతో తెలంగాణ సమాజం ఒక గొప్ప గాయకున్ని, కళాకారున్ని కోల్పోయిందన్నారు. చిన్నతనంలోనే అద్భుతమైన ప్రతిభను సొంతం చేసుకున్న బిడ్డ సాయిచంద్ అన్నారు. మరింత ఉన్నతస్థాయికి ఎదిగే దశలో అకాల మరణం ఎంతో బాధాకర మని సీఎం విచారం వ్యక్తంచేశారు. మధ్యాహ్నం వనస్థలిపురంలోని సాహెబ్‌నగర్ స్మశాన వాటికలో సాయిచంద్ అంత్యక్రియలు జరుగనున్నాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లను ప్రభుత్వ విప్ బాల్క సుమన్ చూస్తున్నారు. మధ్యాహ్నంసాయిచంద్‌నివాసం నుంచి అంతిమయాత్ర ప్రారంభం కానున్నది.

## సాయిచంద్ ఆకస్మిక మణంతో కెసిఆర్ దిగ్భ్రాంతి

**తనను తీవ్రంగా కలచి వేసిందని ఆవేదన**

**అద్భుతమైన ప్రతిభ ఉన్న కళాకారుడని నివాళి**

హైదరాబాద్,జూన్29(ప్రజామంటలు) :తెలంగాణ ఉద్యమ గాయకుడు, ప్రజా కళాకారుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ ఆకస్మిక మరణం పట్ల ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సాయిచంద్ మరణం పట్ల సీఎం సంతాపాన్ని ప్రకటించారు. ఇంత చిన్న వయస్సులో సాయిచంద్ మరణం తనను తీవ్రంగా కలచివేసిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. సాయిచంద్ మరణంతో తెలంగాణ సమాజం ఒక గొప్ప గాయకున్ని, కళాకారున్ని కోల్పోయిందన్నారు. చిన్నతనంలోనే అద్భుతమైన ప్రతిభను సొంతం చేసుకున్న బిడ్డ సాయిచంద్ అన్నారు. మరింత ఉన్నతస్థాయికి ఎదిగే దశలో అకాల మరణం ఎంతో బాధాకరమని సీఎం విచారం వ్యక్తంచేశారు.రాష్ట్ర సాధనలో సాగిన సాంస్కృతిక ఉద్యమంలో సాయిచంద్ పాత్ర అజరామరంగా నిలుస్తుందని సీఎం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ కాలంలో సాయిచంద్ పాడిన పాటలను చేసిన సాంస్కృతిక ఉద్యమాన్ని సీఎం స్మరించుకున్నారు. సాయిచంద్ లేకుండా తన సభలు సాగేవి కావని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ కాలం నుంచి నేటి వరకు తన ఆట పాటలను నిరంతరాయంగా కొనసాగిస్తూనే వున్నాడని గుర్తు చేసుకున్నారు. తన ఆట పాటతో ప్రజలలో నాడు ఉద్యమ స్ఫూర్తిని నేడు అభివృద్ధి చైతన్యాన్ని రగిలించిన తెలంగాణ బిడ్డని కోల్పోవడం తీరని లోటని సీఎం అన్నారు. శోకతప్త హృదయులైన సాయిచంద్ కుటుంబ సభ్యులు ఈ తీవ్ర విషాదాన్ని తట్టుకునే శక్తినివ్వాలని భగవంతున్ని ప్రార్థించారు. వారి కుటుంబానికి తాము అండగా వుంటామన్నారు. వారి కుటుంబ సభ్యలకు సీఎం తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## హరితహారం లక్ష్యం కోసం కృషి

**మొక్కలు నాటేలా ప్రోత్సాహం**

ఆదిలాబాద్,జూన్29 : గతంలో హరితహారంలో దూసుకుని పోయిన ఉమడి ఆదిలాబాద్ జిల్లా అధికార యంత్రాంగం రానున్న హరితహారం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని నిర్ణయించింది. గతంలో మంచి ఫలితాలు సాధించారు. తాజాగా నేరుగానే మొక్కలు నాటేందుకు ఓ వైపు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మరోవైపు కలెక్టర్ అధికారులను ప్రోత్సహిస్తూ ముందుకు సాగుతున్నారు. నాటిన మొక్కలను సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను కోరారు. నాటిన మొక్కల వివరాలను గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఒక రిజిస్టర్ ఏర్పాటు చేసి ఆదేశించారు. గ్రామాల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో మనవంతు బాధ్యతను నెరవేర్చాలని కోరారు. ఇక ఆకుపచ్చని తెలంగాణెళి సీఎం కేసీఆర్ లక్ష్యమని, హరితహారాన్ని ఉద్యమంలా చేపట్టి విస్తృతంగా మొక్కలు నాటాలని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పిలుపుని చ్చారు. పర్యావరణ హితానికే హరితహారం చేపట్టారని, మానవాళి మనుగడకు చెట్లే జీవనాధార మని వివరించారు. హరితహారంలో రాష్ట్ర వ్యాప్తంగా 30వేల కోట్ల మొక్కలు నాటాలన్న లక్ష్యం పెట్టుకు న్నామని, నాటిన మొక్కలన్నీ వందశాతం బతకాలని అధికారులు, ప్రజాప్రతిని ధులను ఆదేశించారు. ఇందులో సర్పంచులు, అధికారులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో చెట్టు నరికిన వారికి భారీ జరిమానా విధించాలని ఆదేశించిన మంత్రి, సర్పంచ్‌లు ప్రోత్సహి ంచినా, విషయం తెలిసి పట్టించుకోకపోయినా పదవులు ఊడుతాయని హెచ్చరించారు. మంకీఫుడ్ కోర్టుల ద్వారా కోతులను గ్రామాల్లోకి రాకుండా చూడవచ్చని చెప్పారు. హరితహారానికి గ్రామ పంచాయతీల నుం చి, ఉపాధి హామీ నిధులు కూడా వినియోగించుకోవాలని సూచించారు.

# సాయిచంద్ అకాల మరణంతో నేతల దిగ్భ్రాంతి







**ఉద్యమనేతను కోల్పోవడంతో పార్టీలో విషాదం**

**పాట ఉన్నన్ని రోజులు సాయిచంద్ ఉంటాడని వ్యాఖ్య**

**మంత్రులు, ఎంపిలు,ఎమ్మెల్యేల ఘన నివాళి**

హైదరాబాద్,జూన్29(ప్రజామంటలు) :ప్రముఖ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ మరణం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని మంత్రి కేటీఆర్ అన్నారు. యువకుడైన సాయిచంద్ అకాల మరణం పట్ల తీవ్ర ఆవేద వ్యక్తంచేశారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి తన గొంతుక ద్వారా ఎనలేని సేవలు చేసిన ఆయన మరణం పార్టీకి తీరని లోటని చెప్పారు. సాంస్కృతిక రంగంలో పాట ఉన్నన్ని రోజులు సాయిచంద్ పేరు శాశ్వతంగా నిలిచిపోతుందని తెలిపారు. సాయిచంద్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ÷ాయిచంద్ అకాల మరణం తనకు ఎంతో బాధ కలిగించిందని మంత్రి హరీశ్ రావు అన్నారు. తన ఆటపాటలతో తెలంగాణ ఉద్యమంలో గొప్ప పాత్ర పోషించి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. ఉద్యమంలో ఆయన పోషించిన పాత్రను తెలంగాణ సమాజం ఎన్నటికీ మరువదన్నారు. సాయిచంద్ భౌతికంగా మన మధ్య లేకపోయినా.. పాట రూపంలో అందరి గుండెల్లో చిరకాలం నిలిచిపోతారని మంత్రి హరీశ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఒక గొప్ప గాయకుడిని, భవిష్యత్ నాయకున్ని కోల్పోయిందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. తన ఆట పాటలతో తెలంగాణ ఉద్యమంలో, తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో సాయిచంద్ పాత్ర విశేషమైనదని తెలిపారు. ఆయన పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. సాయిచంద్ మరణం పట్ల స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సాయిచంద్ మృతిపట్ల మంత్రి నిరంజన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర విస్మరించలేనిదని, అతని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాని చెప్పారు. తెలంగాణ గొప్ప గొంతుకను కోల్పోయిందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గాయకుడు సాయిచంద్ అకాల మరణం పట్ల జగదీశ్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో, రాష్ట్ర పునర్‌నిర్మాణంలో ఆయన సేవలు చిరస్మరణీయంగా నిలిచి పోతాయన్నారు. సాయిచంద్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులు మనోధైర్యంగా ఉండాలని తెలిపారు. తెలంగాణ ఒక గొప్ప కళాకారుడిని కోల్పోయిందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో, పునర్నిర్మాణంలో సాయిచంద్ ఎంతో కీలకమన్నారు. తన పాటలతో ఎంతో మంది అభిమానులను పొందారన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యలకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుని ప్రార్థించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్, ప్రముఖ గాయకుడు సాయిచంద్ మృతిపై మంత్రి గంగుల కమలాకర్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆయన మరణవార్త తనను తీవ్రంగా కలచి వేసిందని చెప్పారు. తెలంగాణ ఒక గొప్ప గొంతుకను కోల్పోయిందని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. గాయకుడు సాయిచంద్ హఠాన్మరణం పట్ల మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సాయిచంద్ కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని, ఆయన ఆత్మకు సద్గతులు కలగాలని భగవంతున్ని ప్రార్థించారు. తెలంగాణ సమాజం ఒక గొప్ప గాయకుడిని కోల్పోయిందని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సాయిచంద్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో సాయిచంద్ కీలక పాత్ర పోషించారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆయన స్వరం ఉద్యమానికి ఆయుపట్టుగా నిలిచిందని చెప్పారు. తెలంగాణ పునర్నిర్మాణంలో ఉద్యమ స్ఫూర్తితో పని చేశారని వెల్లడించారు. తెలంగాణ ఒక గొప్ప కళాకారున్ని కోల్పోయిందన్నారు. మంచి భవిష్యత్తు ఉన్న సాయిచంద్ మరణం తెలంగాణకు తీరని లోటని చెప్పారు. సాయిచంద్ మృతిపట్ల మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన హఠాన్మరణం తనను తీవ్రంగా కలచివేసిందని చెప్పారు. సాయిచంద్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రముఖ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ మృతిపట్ల ఎమ్మెల్సీ కవిత సంతాపం తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో తన ఆట, పాటలతో ప్రజలను చైతన్యవంతులను చేసిన కళాకారుడని అన్నారు. రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా.. అంటూ తన పాటతో ఎన్నో హృదయాలను కదిలించిన సోదరుడు సాయిచంద్ అకాల మరణం తనను ఎంతో కలచివేసిందని చెప్పారు. సాయిచంద్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# ఏజెన్సీ రైతులను ఆదుకోవాలి

- ఎస్సీలకు దళితబంధు అమలు చేయాలి
- వ్యవసాయ రుణాలు ఇచ్చేలా ఆదేశించాలి

ఖమ్మం,జూన్ 29 : ఏజెన్సీ ప్రాంతం మూలంగా తమకు పట్టాలు లేవని, పహానీ పత్రాలు కొద్ది సంవత్సరాల నుండి నిలిపివేయడంతో బ్యాంకు రుణాలు పొందలేక పోతున్నామని ఏజెన్సీ రైతులు అంటున్నారు. దీంతో ప్రభుత్వ సహాయం అందక, అప్పులు లభించక ఉన్న భూములు బీడు భూములుగా మారే దుస్థితి నెలకొందన్నారు. జిల్లాలోని మైదానప్రాంత ఎస్సీలకు పట్టాలు, పహానీలు అందుబాటులో ఉన్నాయి. వారు బ్యాంకు రుణాలు పొందుతూ వ్యవసాయం చేసుకుంటున్నారు. వారికి ప్రభుత్వ పథకాలు రైతు బంధు, రైతుబీమా లాంటివి వర్తిస్తాయి. బడిలో విద్యార్థులకు సీట్లు లభిస్తాయి, హాస్టళ్లలో అక్కడి విద్యార్థులకు అవకాశం ఉంటుంది. కానీ ఏజెన్సీలో ఇవేమి తమకు అందుబాటులో లేవు. ఏజెన్సీలో కేవలం కల్యాణ లక్ష్మి, పింఛన్లు, రేషన్‌బియ్యం వంటి పథకాలు పొందుతున్నామని చెబుతున్నారు. ఈ ప్రాంతంలో తాము పూర్వం నుండి గిరిజనులతో కలిసి సహజీవనం గడుపుతున్నామన్నారు. అప్పట్లోచదువు సంధ్యలు లేక, కేవలం కటుంబ పోషణెళి ధ్యేయంగా కాలం గడుపుతూ పోడు భూములు సాగు చేస్తూ వచ్చారని పేర్కొన్నారు. కాలాంతరం ఈప్రాంతం 1970లో షెడ్యుల్ ప్రాంతంగా మారిందన్నారు. ఇక చేసేది లేక వ్యవసాయం కోసం ప్రభుత్వ సహాయం అందక అప్పులు చేసుకుంటూ వారసుల మాదిరిగా పోడు భూములపై ఆధార పడుతూ కుటుంబ పోషణ గావిస్తున్నామని వివరిస్తున్నారు. దళిత బంధు కింద ప్యాకేజీ కేటాయించాలిఏజెన్సీ ఎస్సీలకు ప్రభుత్వం దళిత బందు పథకం కింద ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని వారు అంటున్నారు. ఈ పథకం కింద ఎస్సీలను పూర్తిస్థాయిలో అభివృద్ధి పర్చేందుకు ప్రతి ఎస్సీ గ్రామంలో వంద శాతం దళిత బంధు అమలు చేయాలని, దీంతో చదువుకున్న నిరుద్యోగులు, రైతులకు ఉపాధి లభిస్తుందని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని ఈ ప్రాంత ఎస్సీ రైతులు, నిరుద్యోగులు కోరుతున్నారు.ఏజెన్సీ ప్రాంతంలోని రైతులు ఇంకా వ్యవసాయ పనులు మొదలు పెట్టలేదు. చేపోడు భూములను సాగు చేయని దుస్థితి ఏజెన్సీ రైతులది. గతేడాది వర్షాలు అధికంగా పడడంతో దిగుబడి సరిగా రాలేదు. దీంతో చేసిన అప్పులు తిరిగి చెల్లించలేక పోయారు. ఈ కారణంగా ఈ ఏడాది అప్పులు ఇచ్చే వారు కరువయ్యారు. ఈ క్రమంలో తమకున్న పోడు భూములను సాగు చేయలేక పోతున్నామని ఏజెన్సీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# భారత అంతర్గ వ్యవహారలపై ఒబామా విపరీత వ్యాఖ్యలు

(మొదటిపేజీ తరువాయి)



హుందాగా జరిగింది. ఒబామా కఠిన సందేశాన్ని పంపించడం, బైడెన్ ఇండియాను మచ్చిక చేసుకోవడంలో 'మంచి పోలీసు-చెడ్డ పోలీసు' విధానం ఉందనే ఊహాగానాల్లో నిజం ఉందా అని ఆ పత్రిక ప్రశ్నించినపుడు ఆ అధికారి స్పందిస్తూ, అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా పట్ల తమకు గొప్ప గౌరవం ఉందని, అయితే ఆయన ఓ ప్రైవేటు వ్యక్తి అని, ఆయన మాటలు తమతో సమన్వయంతో మాట్లాడినవి కాదని చెప్పారు. బైడెన్-మోదీ మధ్య జరిగిన ప్రైవేటు సంభాషణ స్వభావాన్ని తాను వివరించలేనని చెప్పారు. అయితే ప్రతి అంశాన్నీ, ప్రతి సమస్యను వారు చర్చించారని చెప్పగలనని తెలిపారు. అత్యున్నత స్థాయి హుందాతనంతో ఈ పని చేయడం బైడెన్ శైలి అని తెలిపారు. సన్నిహిత భాగస్వామ్య స్ఫూర్తితో మాట్లాడటం, భాగస్వాములను గౌరవంగా చూడటం బైడెన్ శైలి అని చెప్పారు. ప్రధాని మోదీతో కూడా ఈ విధంగానే ఆయన వ్యవహరించారని భావిస్తున్నాన న్నారు. చర్చించాలని కోరుకునే అంశాలు ప్రతి దేశానికి ఉంటాయన్నారు. సమస్యల గురించి నేరుగా మోదీతో బైడెన్ మాట్లాడటం కాదని, మోదీ కూడా కొన్ని అంశాలను లేవనెత్తాలని కోరుకుంటారని అన్నారు. సమస్యలను గౌరవప్రదంగా చర్చించడానికి వారి మధ్యగల గాఢమైన సత్సంబంధాలు అవకాశం కల్పించాయన్నారు. తాను చెప్పినదానిని ఎదుటివారు గౌరవభావంతో విన్నారనే విశ్వాసం కలిగేలా వారు మాట్లాడుకున్నారని చెప్పారు.

# చక్రం తిప్పిన అసంతృప్త నేతలు

(మొదటిపేజీ తరువాయి)

కార్యకర్తలు ఆలోచనలో పడ్డట్లుగా చెప్పుకొంటున్నారు. ఈ నేపథ్యంలో బిజేపి రాష్ట్ర అధ్యక్షుని మార్చక తప్పదనే ఆలోచనలలో జాతీయ నాయకత్వం ఉన్నట్లు, కొద్ది రోజజుల్లోనే బిజేపిలో అనూహ్యమైన మార్పులు రావచ్చని అనుకొంటున్నారు.

**కేటీఆర్ డిల్లీ టూర్ మంత్రాంగం పనిచేసిందా ?**

భారాస కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు,(కేటిఆర్) గత వారం జరిపిన డిల్లీ టూర్ లో బిజేపి మంత్రులను కలిసినపుడు కూడా ఇక్కడి రాజకీయ పరిస్థితులపై చర్చ జరిగినట్లు, మొదటి నుండి తమకు అనుకూలంగా చెప్పుకొంటున్న కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డీ కి అధ్యక్ష పదవి ఇవ్వడం రెండు పార్టీలకు



అనువుగా ఉంటుందనే విషయాన్ని లోపాయికారిగా చర్చించుకొన్నట్లు, డిల్లీ కారిడార్లలో చర్చ జరుగుతుంది. కిషన్ రెడ్డి బిజేపి రాష్ట్ర అధ్యక్షుని చేయడంతో భారాస -బిజేపి లమధ్య తెలియని బంధం మరింత బాలపడదమే కాకుండా, కాంగ్రెస్ కు రెడ్లను దూరం చేయవచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. ప్రతిపక్షాల ఐక్యతకు పెద్ద ఎత్తున ప్రయత్నించిన భారాస అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, పాట్నా సభకు దూరం కావడం కూడా బిజేపి-భారాస లమధ్య కుదిరిన అంతరంగిక ఒప్పందాలే కరణమనే ప్రచారం కూడా జరుగుతుంది.

**భారాస పై సంజయ్ రావత్ కీలక వ్యాఖ్యలు :**

మొన్న సర్కోలి, మహారాష్ట్రలో కెసిఆర్ సభ తరువాత శివసేన నాయకులు సంజయ్ రావత్ ఒక ప్రకటనలో భారాస పార్టీ మహారాష్ట్రలో ఎలాంటి ప్రభావం చూడమే కాదు, అది బిజేపికి బ-టీం అని ప్రకటించడం కూడా తెలుగు ప్రజలను ఆలోచనలో పడేసింది. తెలంగాణలో కూడా మారుతున్న పరిస్థితులలో, భారాస పట్ల బిజేపి మెతక వైఖరి కాంగ్రెస్ పార్టీకి కలిసి వస్తుందనే ప్రచారం కూడా జరుగుతుంది. అలాగే పొంగులేటి, జూపల్లి కాంగ్రెస్ లో చేరడం కూడా కాంగ్రెస్ గ్రాఫ్ ను పెంచింది.

# దళితులను హత్యలు చేయిస్తున్న బి.ఆర్.ఎస్. పార్టీని బొంద పెడుదాం

- భూ మాఫియాతో హత్యలు చేయిస్తున్న ముత్తిరెడ్డికి రాజకీయ గుణపాఠం చెప్పుదాం
- రామకృష్ణయ్య హత్యకు పాల్పడ్డ నిందితులను శిక్షించే వరకు పోరాటం ఆగదు
- ఎంఆర్‌పిఎస్ రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిల పక్ష నేతలు



జనగామ జూన్ 29 (ప్రజామంటలు): రిటైర్డ్ ఎంపిడిఓ రామకృష్ణయ్య హత్యను నిరసిస్తూ ఎం.ఆర్.పి.ఎస్, ఎం.ఎస్.పి. ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా, కుల సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం జనగామలో గురువారం నిర్వహించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ఎం.ఎస్.పి జిల్లా ఇంచార్జి ఇనుముల నర్సయ్య మాదిగ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎం.ఆర్.పి.ఎస్. రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ మాట్లాడుతూ రామకృష్ణయ్య హత్యకు వందకు వంద శాతం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.ఎమ్మెల్యే ప్రోద్భలం ఉందనే కారణంతో అంజయ్య బరి తెగించి రామకృష్ణయ్య ను హత్య చేయించారని అన్నారు. ఎమ్మెల్యే ప్రోద్భలం లేకుంటే రామకృష్ణయ్య కుటుంబాన్ని నేటికీ ఎందుకు ఎమ్మెల్యే ఎందుకు పరామర్శించలేదని, అంజయ్య భార్య భాగ్యలక్ష్మిని జడ్పి వైస్ చైర్మన్ పదవి నుండి ఎందుకు తొలగించలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రామకృష్ణయ్య హత్య కేసులో పాత్రధారులు మాత్రమే అరెస్ట్ అయ్యారని, సూత్ర దారులు, కుట్ర దారులు ఇంకా బయట స్వేచ్ఛగా తిరుగుతున్నారని, కొన్ని చోట్ల బాణ సంచా కాల్చి సంబరాలు కూడా జరుపుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ హత్య మీద హైకోర్టు సిట్టింగ్ జడ్జీ ద్వారా లేదా సిబిఐ ద్వారా దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. విధుల్లో అలసత్వం వహించన ఎస్ఐ ని సస్పెండ్ చేసిన పోలీస్ శాఖ సిఐ ని కూడా తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.సిఐ ని విధుల్లో కొనసాగించితే సూత్రధారులను కుట్ర దారులను తప్పించే అవకాశం ఉందని అన్నారు. దోషుల్లో ఏ ఒక్కరూ తప్పించుకోకుండా చూడాలని అన్నా రు. రామకృష్ణయ్య హత్య కేసులో నిందితులకు కఠినంగా శిక్షించే వరకు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు అన్ని పార్టీలను అన్ని సంఘాలను కలుపుకొని ఉద్యమన్ని ఉదృతం చేస్తామని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని రాజకీయంగా బొంద పెడితేనే దళితుల మీద హత్యలను అరికట్టవచ్చునని అన్నారు. అందుకోసం ఐక్య కార్యాచరణతో ముందుకు సాగాలని అన్నారు. భూ కబ్జాలకు, హత్యలను ప్రోత్సహిస్తున్న ముత్తి రెడ్డి చెర నుండి జనగామను విడిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

హత్యను నిరసిస్తూ అందరినీ ఒక వేదిక మీదకు తీసుకొచ్చిన ఎం.ఆర్.పిఎస్ ను అభినందిస్తూ వారు తీసుకున్న ఉద్యమ కార్యాచరణలో భాగమై ఉద్యమిస్తామని ప్రకటించారు. వామపక్ష నేతలు, మాజీ ఎమ్మెల్యే సిపిఐ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనుకరెడ్డి మాట్లాడుతూ.... రామకృష్ణ హత్యకు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డినే బాధ్యత వహించాలని, అధికార బలంతోటే ప్రజల పక్షాన కోట్లాడుతున్న రామకృష్ణను హతమార్చరని, ఇందులో పాత్రధారుల కంటే సూత్రధారులే ఎక్కువ కాబట్టీ వారిని గుర్తించి శిక్షించాలని అన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షులు ఆరుట్ల దశమంత్ రెడ్డి మాట్లాడుతూ.... ఈ హత్య వెనుక రాజకీయ కుట్ర దాగి ఉన్నదని, చాలా మందిని హతమార్చి హత్య రాజకీయాలు చేస్తున్నారని, దీని మీద నిష్పక్షపాత విచారణ జరపాలని, సూత్రధారులు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాజీ, టిపిసిసి డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ మాట్లాడుతూ బి.ఆర్.ఎస్ నేతలు భూ కబ్జాలకు పాల్పడుతూ అరాచకాలు చేస్తున్నారని, ప్రజల పక్షాన పోరాడుతున్న వాళ్లపై ప్రశ్నించే గొంతులపై దాడులకు పాల్పడుతున్నారని, ఎమ్మెల్యే ప్రోద్భలం తోటే ఈ హత్య జరిగిందని, ఎమ్మెల్యేను కూడా విచారించాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి కటినంగా శిక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారు డు గాదె ఇన్నయ్య, బిఎస్పి జిల్లా ఇంఛార్జి నీర్మాల రత్నం, అంబెద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిలయ్య, ఎం.ఆర్.పి.ఎస్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ, వైఎస్ఆర్టిపి జిల్లా అధ్యక్షులు సమ్మయ్య, వెంకట్ రెడ్డి, గిరిజన జేఏసీ జాతీయ నాయకుల జైసింగ్ రాథోడ్, మాడు లక్ష్మణ్ నాయక్, ఎం.ఆర్.పి.ఎస్ జిల్లా కన్వీనర్ పైసా రాజశేఖర్ మాదిగ, ప్రముఖ వైద్యులు డా. రాజమౌళి, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి జనార్ధన్, బూడిద గోపి, హైకోర్టు న్యాయవాది సాధిక్ అలీ, జరసం కవులు అయిల సోమ నర్సింహ చారి, రెడ్డి రత్నాకర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు బొట్ల శ్రీనివాస్, ఉడుగుల రమేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి రాపర్తి రాజు, కెవిపిఎస్ రాష్ట్ర నాయకురాలు పల్లేర్ల లలిత, జిల్లా అధ్యక్షులు దేవదానం, విహెచ్ పిఎస్ జిల్లా అధ్యక్షులు తల్లపల్లి కుమార్, ఎస్.ఎఫ్.ఐ. జిల్లా కార్యదర్శి ధర్మబిక్షం, సిపిఐ జిల్లా కార్యదర్శవర్గ సభ్యులు సోమయ్య, ఎం.ఇ.ఎఫ్ జాతీయ నాయకులు చెప్పాల ప్రసాద్ మాదిగ, సుంచు విజయేందర్, ఎం.ఎస్.పి జిల్లా నాయకులు సుంచూ రాజు మాదిగ, నిర్మాల భాస్కర్ మాదిగ, గువ్వల రవి మాదిగ, జేరిపోతుల సుధాకర్ మాదిగ, ఎం.ఆర్.పి.ఎస్ జిల్లా కో కన్వీనర్లు బొట్ల మహేష్, ఇనుముల అనిల్, ఎల్ హెచ్ పి ఎస్ యువసేన నరేష్ నాయక్, టిఎస్ఎఫ్ అధ్యక్షులు చందు నాయక్, బి.ఎస్.పి. నేతలు తాళ్లపల్లి వెంకటస్వామి, మేధావులు, ప్రొఫెసర్లు ఆనంద్ కుమార్, సి.హెచ్. నర్సింహులు, నవీన్ చారి, స్వామి మాల, ఎం.ఎస్.పి. నేతలు అల్వల నర్సింగరావు, కుమారస్వామి, రాజు, సిపిఎం జోగు ప్రకాష్, భరత్ బచావో సోమయ్య, లక్ష్మి, అంజయ్య, రామక్రిష్ణ కుటుంబ సభ్యులు, అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా, కుల, విద్యార్థి, మేధావి సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ



జగిత్యాల జూన్ 29 (ప్రజామంటలు): తొలి ఏకాదశి పండుగ సందర్భంగా జగిత్యాల పట్టణంలోని 19వ వార్డులో మహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్. అనంతరం వార్డులో సీసీ రోడ్లు, పలు అభివృద్ధి పనులను పరిశీలించి, ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కౌన్సిలర్ లు ముస్కు నారాయణ రెడ్డి, క్యాదాసు నవీన్, శేఖర్, చుక్క నవీన్, నాయకులు సమిండ్ల శ్రీనివాస్, రంగు మహేష్, రామకృష్ణ, బండారి రాజ్ కుమార్, కూతురు శేఖర్, పట్టణ సోషల్ మీడియా కన్వీనర్ అలిశెట్టి వేణు, పట్టణ పార్టీ యూత్ ప్రధాన కార్యదర్శి శరత్ రావు, డిఈ రాజేశ్వర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎదలకు ఉచిత కంటి ఆపరేషన్లు

### చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



జగిత్యాల జూన్ 29 (ప్రజామంటలు): పావని కంటి ఆసుపత్రి ఆపి, రోటరీ క్లబ్ జగిత్యాల వారి ఆధ్వర్యంలో జగిత్యాల నియోజకవర్గం లోని వివిధ గ్రామాలకు చెందిన 14 మంది నిరుపేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో డా. విజయ్, కౌన్సిలర్లు కూతురు రాజేష్, ఆవారి శివ కేసరి బాబు, పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి శరత్ రావు, నాయకులు జాన గోపి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులు



రాయికల్ జూన్ 29 (ప్రజామంటలు): రాయికల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులు జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ను ఎమ్మెల్యే క్వార్టర్స్ లో మర్యాదపూర్వకంగా కలిసి, కమిటీ నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే కు పుష్ప గుచ్చాన్ని అందజేసి ధన్యవాదాలు తెలపగా శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మెన్ మోర హనుమండ్లు, జెడ్పీటీసీ అశ్విని జాదవ్, మండల పార్టీ అధ్యక్షులు కోల శ్రీనివాస్, మాజీ ఏఎంసి ఛైర్మెన్ గన్నే రాజీ రెడ్డి, రాయికల్ ఏఎంసి ఛైర్మెన్ మారంపల్లి రాణి సాయిబాబు, వైస్ చైర్మన్ బర్కం మల్లేశం, కార్యవర్గ సభ్యులు అత్తినేని సాయి రెడ్డి, బత్తిని వెంకటేష్, సభావత్ రాజన్న, ఇర్ఫాన్ అలీ, కొడిపల్లి సామి రెడ్డి, సూర విజయ్, కోల రాజు, ఎలగందుల రమేష్, ఉడుత గంగరాజం, ఎదుమల శ్రీధర్ రెడ్డి, మాద రమేష్, సుర పాపయ్య, జిల్లా ఎంపీటీసీలు పోరం అధ్యక్షులు నాగ రాజు, జిల్లా ఆర్‌టిఏ మెంబర్ సుధాకర్ రావు, సర్పంచులు, ఎంపీటీసీ లు, ప్రజాప్రతినిదులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వెల్లుల్ల లో ఉచిత నేత్ర వైద్య శిబిరం



మెట్ పల్లి జూన్ 29 (ప్రజామంటలు): వెల్లుల్ల గ్రామ పంచాయతీ లో లయన్స్ క్లబ్ మెట్ పల్లి వారి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. సర్పంచ్ గూడూరు రజిని తిరుపతి, పంచాయతీ కార్యదర్శి మెర్గ అశోక్ గౌడ్, ప్రెసిడెంట్ కట్కం రాకేష్, సెక్రటరీ ఇల్లేందుల శ్రీనివాస్, క్యాషియర్ ఇందూరి, జడ్సి కోట గంగజీవన్ రాకేష్, కటగిరి తిరుమల చారి, ఆల్ రౌండర్ గంగాధర్, కోట విజయ్ కుమార్, ఇల్లేందుల వెంకటేశ్వర్లు, బాస నర్సింగరావు, బోమేళ్ల శంకర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విశ్వనాథరెడ్డి వర్ధంతి వేడుకలు



భీమదేవరపల్లి జూన్ 29 (ప్రజామంటలు): ముల్కనూర్ సహకార సంఘంలో గురువారం సంఘ వ్యవస్థాపకులు అలిగిరెడ్డి కాశి విశ్వనాథ రెడ్డి 37వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘ సీనియర్ సభ్యులు గంగం వెంకట్ రెడ్డి, ముద్దం వెంకట్ రెడ్డి గార్ల చేతుల మీదుగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ ఇరువై మూడు వందల మూల ధనంతో ప్రారంభమై నేడు మూడు వందల కోట్ల సంఘముగా అవతరించడంలో విశ్వనాథ రెడ్డి పాత్ర ఎనలేనిదని కొనియాడారు. ఈ సందర్భంగా వారు సహకార సంఘానికి చేసిన సేవ, అభివృద్ధిని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమములో సంఘము జనరల్ మేనేజర్ మారుపాటి రాంరెడ్డి, ఉపాధ్యక్షులు చీకట్ల రాజయ్య, కార్యవర్గ సభ్యులు రఘునాయకుల వెంకట్ రెడ్డి, బానోతు కిషన్, గద్ద అయిలయ్య, అన్నం తిరుపతి రావు, కూన కనుకయ్య, మారుపాటి జయపాల్ రెడ్డి, కంకల భాగ్య, కదారి ఆదాం, గజ్జి వీరయ్య, అంబాల రాములు, ఈర్ల మూగయ్య, బేల కనుకమ్మ, కంది రవిందర్ రెడ్డి, సభ్యులు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

## అధికారంలో ఉండి ఎస్సీ వర్గీకరణ చేయని పార్టీలు

### మాదిగలకు శత్రువులే



ఎల్కతుర్తి జూన్ 28 (ప్రజామంటలు): ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ప్రతిపక్ష స్థానంలో ఉన్నప్పుడు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా వ్యవహరించి అధికారంలోకి రాగానే ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న రాజకీయ పార్టీలన్నీ మాదిగ జాతికి శత్రువులే అని ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ అన్నారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో బొంకురి వంశీ మాదిగ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశం న్యాయమైనదని సమాజం యావత్తు అంగీకరిస్తుంది. అందరు న్యాయమైనదని అంగీకరించినాకూడ పరిష్కారం జరగని ఏకైక సమస్య ఎస్సీ వర్గీకరణ మాత్రమే అని అన్నారు. ఇది ఈ దేశ, రాష్ట్ర పాలకుల నీచమైన విధానాలకు అద్దం పడుతుందని అన్నారు. ప్రస్తుతం దేశంలొ పరిష్కారం జరగాల్సిన సమస్యల్లో ప్రప్రథమ స్థానంలో ఎస్సీ వర్గీకరణ ఉంటుందని అన్నారు. కనుక ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ కోసం దేశంలో సుదీర్ఘమైన రాజీలేని పోరాటం మాదిగ జాతి కొనసాగిస్తుందని అన్నారు. వర్షాకాల పార్లమెంట్ సమవేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత సాధించుకోవ డానికి మాదిగ ప్రజలంతా మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా జూన్ 30 వ తేదీన పరకాల పట్టణంలో ఎంఆర్‌పిఎస్, ఎం.ఎస్.పి. జిల్లా మహాసభ ఏర్పాటు చేస్తున్నామని, ఎం ఆర్ పి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొంటారని అన్నారు కావున జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి మాదిగ ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గంగారపు శ్రీనివాస్ ఎం.ఎస్.పి. జిల్లా కన్వీనర్, నలిమల నాగరాజు ఎం.ఎస్.పి. జిల్లా నాయకులు, మాట్ల వెంకటస్వామి, తాళ్లపెల్లి మధు ఎం ఎస్ పి జిల్లా నాయకులు, ఈసంపెల్లి రాజు ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు, కాడర్ల నవీన్ చారి ఎంఆర్‌పిఎస్ స్థానిక నాయకులు మైస ప్రశాంత్ బొంకూరి యాదగిరి, మిట్టపల్లి నవీన్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## కొమ్మూరి ప్రతాప్ రెడ్డికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ



### చూసి ఓర్వలేక బి.ఆర్.ఎస్. చిల్లర మాటలు

జనగామ జూన్ 29 (ప్రజామంటలు): కొమ్మూరి ప్రతాప్ రెడ్డికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక బి.ఆర్.ఎస్. చిల్లర మాటలు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. జనగామ కొమ్మూరి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యకర్త సమావేశంలో జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బనుక శివరాజ్ యాదవ్, జనగామ పట్టణ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మోటే శ్రీనివాస్, జనగామ జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి ఆలేటి సిద్దిరాములు, జనగామ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లింగాల నర్సి రెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఆకుల లక్ష్మయ్య పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... నిన్నటి ప్రెస్‌మీట్ లో ఉన్న బి.ఆర్.ఎస్. నాయకులకు వారి గత చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని అన్నారు. ప్రజల బాగుకోసం ఆరాటపడే వ్యక్తి కొమ్మూరి ప్రతాపరెడ్డి అని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి మెప్పు పొందడానికి అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. మొన్నటికి మొన్న బచ్చనపేటలో ఎంపిడిఓ రామకృష్ణ హత్య మీ బిఆర్ఎస్ గుండా నాయకులు చేసింది కాదా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారుల ఆనవాలు లేకుండా టీ.ఆర్.ఎస్ పార్టీని బి.ఆర్.ఎస్. గా మార్చింది మీరు కాదా అని అన్నారు. టిఆర్ఎస్ పార్టీ నాయకులకు అవగాహన లేని వ్యాఖ్యలు చేస్తూ ప్రజల బాగు కోసం నడిచే సంతను అక్రమంగా కబ్జా చేస్తే తన సొంత కూతురే ఈ భూమి కబ్జాకు గురైంది. చేర్యాల మున్సిపాలిటీ రాసిస్తున్నాను. మా నాన్న సంగతి మీకు తెలియదా అని తెలిపాక కూడా తన కూతురుతో కొమ్మూరి ప్రతాపరెడ్డి రాజకీయం చేస్తున్నారని మాట్లాడడం వారి రాజకీయ అవివేకానికి నిదర్శనం అన్నారు.చేర్యాల సంత ఓపెనింగ్ చేసిన తుల్జా భవాని రెడ్డి స్వయంగా ప్రతాప్ రెడ్డి ఎవరో నాకు తెలియదు అని చెప్పిన తర్వాత కూడా టిఆర్ఎస్ పార్టీ నాయకులు వారి రాజకీయ పబ్బం గడపడానికి ప్రతాప్ రెడ్డి మీద నిందలువేస్తూ మాట్లాడడం సిగ్గుచేటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ మండల ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు గజే అనిల్ ముదిరాజ్, పిట్టల సతీష్, జాయ మల్లేష్, కడారు ప్రవీణ్, కోట నాయక్, ఓబుళాపురం మాజీ ఉప సర్పంచ్ ముక్క జనార్దన్, కోట నాయక్, కొమ్మూరి యువ సేన జనగామ మండల అధ్యక్షులు బక్క ప్రవర్దన్, అశోక్, లింగాల వెంకట్ రాంరెడ్డి, మోటే సాగర్ పాల్గొన్నారు.

## మెపా రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శిగా ఎం.వీ.కే. మల్లిక్ ముదిరాజ్



హనుమకొండ జూన్ 29 (ప్రజామంటలు): ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర (మెపా) సాంస్కృతిక కార్యదర్శిగా ప్రముఖ సంగీత దర్శకుడు ఎంవీకే మల్లిక్ ముదిరాజ్ నియమితులయ్యారు. గురువారం హన్మకొండలోని మెపా కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియామకాన్ని మెపా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ప్రకటించారు. అనంతరం నియామకపత్రం అందజేసి సన్మానించారు. అనంతరం ఎంవీకే మల్లిక్ ముదిరాజ్ మాట్లాడుతూ.... తన కిచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. ముదిరాజ్ విద్యార్థుల ఉన్నతికి సహాయ సహకారాలు అందిస్తున్న మెపా కార్యక్రమాలు నచ్చి తాను జాతికి సేవచేయాలనే తపనతో ఈ బాధ్యతలు తీసుకున్నానని, జాతి ఐక్యతకు ఆట – పాటలే ముఖ్యం అని, మెపా అభివృద్ధి కోసం కృషి చేస్తానని వాగ్దానం చేశారు. మెపా రాష్ట్ర అధ్యక్షుడు డా. కొత్తగట్టు శ్రీనివాస్ ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ ముఖ్యంగా మెపా ముదిరాజ్ కులంలో విద్య, ఉపాధి, ఉద్యోగ, సాధికారత కోసం మెపా పనిచేస్తుందని అన్నారు. అత్యధిక భాగం జనాభా కలిగిన మనం ఎంతో, మనకి అంత శాతం చట్టసభల్లో సీట్లు దక్కేలా ప్రధాన రాజకీయ పార్టీలపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్ల పంపిణీ సరిగా విభజించబడ లేదని, ఇంతవరకు ఎటువంటి సవరణలు కూడా జరగలేదని ముదిరాజ్‌లకు బీసీ–డీ గ్రూపుతో చాలా అన్యాయం జరుగుతోందని, జనాభా ప్రాతిపదికన వెంటనే ముదిరాజ్‌లకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు కల్పించాలని అవసరమ్మైతే ప్రత్యేక గ్రూపును ఏర్పాటు చేయాలన్నారు. ముదిరాజ్‌లు కుల వృత్తితో పాటు అక్షరాస్యతలో సమాజంలో అత్యున్నత స్థాయిల్లో ముందంజలో ఉండి తమ జాతి యువత లో విద్యాభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. ముదిరాజ్ లలో హైస్కూల్ స్థాయిలో 90 శాతం మంది చదువు మానేస్తున్నారని, వారు ఉన్నత విద్యలో రాణించేందుకు, ఇప్పటికే ఉన్నత విద్యలో, ఉద్యోగాల్లో ఉన్న వారు అన్నివిధాలా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర కమిటీ సభ్యులు డా.కట్ల శ్రీనివాస్, డా. అల్లం వేణుమాధవ్, రేగుల మొగిలి, పెండెం మధుసూదన్, గుండ్ర చంద్రశేఖర్, బయ్య అశోక్, ఉడుత మహేందర్, నీరటి రాజు, బీస రమేష్ తదితరులతో పాటు వివిధ జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.


## కొత్తపల్లిలో ఘనంగా బక్రీద్ వేడుకలు

### ఆనందంగా అలయ్-బలయ్



భీమదేవరపల్లి జూన్ 29 (ప్రజామంటలు): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఈద్–అల్– ఆదా వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు నిర్వహించారు. ఈద్గా మసీదుల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అల్లాపై ఉన్న విశ్వాసాన్ని చాటుతూ త్యాగాలకు మారుపేరుగా తాము బక్రీద్ పర్వదినాన్ని జరుపుకుంటున్నామని ముస్లిం సోదరులు తెలిపారు. ఈ వేడుకలలో మహమ్మద్ జనాబ్, రషీద్, రియాజుద్దీన్, నజీముద్దీన్, యాకూబ్, యాకూబ్ పాషా, స్టాలిన్ బేగ్, ఫయాజుద్దీన్, సిరాజుద్దీన్, జియాజుద్దీన్, కాజామియా, రహమ తుల్లా, అప్సర్, రహీముద్దీన్, రాజ్ మహమ్మద్, అహ్మద్ పాషా పాల్గొన్నారు.

## ఎర్రబెల్లి గ్రామాన్ని భీమదేవరపల్లి మండలంలో విలీన ఉత్తర్వులు




### ఎమ్మెల్యే సతీష్ బాబుకి కృతజ్ఞతలు తెలిపిన గ్రామ సర్పంచ్

### హర్షం వ్యక్తం చేసిన ఎర్రబెల్లి గ్రామ ప్రజలు

భీమదేవరపల్లి జూన్ 29 (ప్రజామంటలు): గతంలో భీమదేవరపల్లి మండలంలో ఉన్న ఎర్రబెల్లి గ్రామాన్ని నాటి మండలాల పునర్వ్యవస్థీకరలో భాగంగా వేలేరు మండలంలో చేర్చారు. కాగా బుధవారం ఎర్రబెల్లి గ్రామాన్ని తిరిగి భీమదేవరపల్లి మండలంలో చేరుస్తున్నట్లు ప్రభుత్వ గెజిట్ విడుదల చేశారు. గత కొద్ది రోజులుగా ఎర్రబెల్లి గ్రామ ప్రజలు తిరిగి భీమదేవరపల్లి మండలంలోని కలపాలని, ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించుకోగా హుస్నాబాద్ బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ ఎర్రబెల్లి గ్రామాన్ని తిరిగి భీమదేవరపల్లి మండలంలో కలుపుతున్నట్లుగా ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, గ్రామ సర్పంచ్, ఎమ్మెల్యే సతీష్ బాబుకు, పురపాలక మంత్రి కేటీఆర్ కు కృతజ్ఞతలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు.

## రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటించిన సర్పంచ్ చల్ల మల్లారెడ్డి



ఎల్కతుర్తి జూన్ 28 (ప్రజామంటలు): ఎల్కతుర్తి మండల కేంద్రంలోని జీలుగుల గ్రామములో కోతుల నడుమ నుండి జీలుగుల వరకు రోడ్డుకు ఇరువైపులా గ్రామ పంచాయతీ సిబ్బందితో చెట్లు నాటించిన గ్రామ సర్పంచ్ చల్ల మల్లారెడ్డి కారోబార్ ఎండి హైమద్ పాషా మరియు గ్రామ ప్రజలకు రోడ్డు మీద వెళ్లే వాహనాదారులకు చల్లని నీడ ఉంటుందని రోడ్డుకు ఇరువైపుల చెట్లను నాటడం వల్ల ప్రకృతితో పాటు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.


# ఉపాధి రంగాలను ప్రోత్సహించాలి !

**మూ**డేళ్ల క్రితం భారతదేశంలో కరోనా వ్యాప్తి, మరణాల సంఖ్య కారణంగా ప్రజల ఆర్థికస్థితి చితికిపోయింది. పేదలు మరింత పేదలుగా మారారు. అలాగే మధ్య తరగతి ప్రజలు మరింతగా దెబ్బతిన్నారు. ఈ క్రమంలో కరోనా దెబ్బనుంచి ప్రజలు ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నారు. పరిస్థితులు ఆర్థికంగా అనుకూలంగా లేకున్నా నిలదొక్కుకునే ప్రయత్నంలో నిమగ్నం అయ్యారు. ధరల దాడిని ఎదుర్కొంటూ మళ్లీ సాధారణ జీవితంలోకి ఒదిగిపోతున్న వేళ దేశంలో ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలు గుదిబండగా మారుతు న్నాయి. రూపాయి విలువ రోజురోజుకూ పతనం అవుతోంది. దీంతో విదేశాలకు వెళ్లాలనుకునే విద్యార్థులు, ఉద్యోగార్థులకు తీవ్ర ఇక్కట్లు ఎదురవుతున్నాయి. దేశంలో ఆర్థిక దుస్థితిని పరిశీలించి అడ్డుకట్ట వేసే చర్యలు కానరావడం లేదు. నిత్యావసర, కూరగాయల ధరలు మోత మోగిస్తున్నాయి. సగటు కుటుంబానికి నెలకు 50వేలు లేనిదే గడవలేని దుస్థితి నెలకొంది. జిఎస్టీలు తగ్గించడం, ఇన్‌కమ్ టాక్స్ పరిమితి పెంచడం,ఉపాధి రంగాలను బలోపేతం చేయడం,వస్తూత్పత్తి పెంచడం వంటి అత్యవసర చర్యలపై కేంద్ర,రాష్ట్రాలు దృష్టి సారించడం లేదు. ఆర్థికంగా దేశాన్ని బలోపేతం చేసే చర్యలపై మోడీ ప్రభుత్వం పెద్దగా పట్టించుకోవడం లేదు. కార్పోరేట్లకు అండగా నిలవడం తప్ప ప్రజలకు అండగా ఉండే చర్యలు కానరావడం లేదు. ప్రజలను కష్టాల కొలిమిలోంచి బయటపడేసే చర్యలు కానరావడం లేదు. మున్ముందు కరోనాను మించిన ఉపద్రవం ఉందని ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. అయినా ప్రజలు బెదరడం లేదు. ఉంటే ఉంటాం.. పోతే పోతాం అన్న ధోరణిలో జీవితంతో పోరాడుతున్నారు. ఎవరికి వారు పొట్టకూటి కోసం పడరాని తిప్పలు పడుతున్నారు. కాయకష్టం చేసుకునే వారికి ఢోకా లేకున్నా ఉపాధి, ఉద్యోగ రంగాలు మాత్రం వెక్కిరిస్తు న్నాయి. దెబ్బతిన్న రంగాలను గుర్తించి వారిని ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. ప్రధానంగా లోయర్ మిడిల్ క్లాస్ వాళ్లు బాగా దెబ్బతిన్నారు. ఉద్యోగాలు పోయాయి. ఉపాధి దొరకడం లేదు. ఈ వర్గాలను గుర్తించి వారిని నేరుగా ఆదుకునే చర్యలకు ఉపక్రమించాలి. గతంలో ప్రకటించిన ఆత్మనిర్భర భారత్ ఎవరికి మేలు చేసిందో తెలియదు. పోనీ ఎవరైనా గట్టిగా మాకు ఈ మేలు జరిగిందని చెప్పడం లేదు. నిజానికి సర్వే జరిపించి ఉపాధి, ఉద్యోగాలు కోల్పోయిన వారిని గుర్తించి నేరుగా నగదు బదిలీ పథకం లాంటి చేపడితేనే ప్రజలు మళ్లీ నిలదొక్కుగోలరు. అలాగే బ్యాంకులు ఉదారంగా తక్కు వడ్డీలకు రుణాలు ఇచ్చేలా చూడాలి. చిన్నా చితకా వ్యాపారాలు చేసుకునే వారికి కనీసం కోటి వరకు ఎలాంటి షరతులు లేకుండా రుణాలు ఇవ్వగలగాలి. అప్పుడే గ్రామీణ ఆర్థికరంగం బలోపేతం అవుతుంది. ఆత్మనిర్భర భారత్‌తో పాటు ఇప్పటికే ప్రకటించిన ప్యాకేజీలు ఏవీ కూడా సామాన్యులకు దోహదపడవని అర్థం అవుతోంది. సామాన్యులకు మేలు చేసేలా పథకరచన సాగడం లేదు. వ్యక్తులు లేదా కుటంబాలను ఆదుకోవడానికి ఏదో రకమైన వెసలుబాటు ఉండాలి. ఎవిరికి వారు కోలుకోవాలంటే ఇప్పటికిప్పుడు సాధ్యం అయ్యేలా లేదు. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉన్నది. ఆర్థిక భయం కూడా మధ్యతరగతి వారిని వేధిస్తున్నది. ఈ కష్టాల కొలిమిలోంచి ప్రజలు బయటపడేందుకు వ్యక్తిగత ప్రయోజనాలు సమకూర్చాలి. అప్పుడు దేశీయ ఆర్థికరంగం బలోపేతం కాగలదు. బ్యాంకులను అందుకు సన్నద్ధం చేయాలి. అసత్యాలు, అర్థసత్యాలతో ఎప్పటికప్పుడు నెట్టుకురావడం కాక, ప్రజల మనసుల్లో రక్షకులుగా చిరస్థాయిగా నిలిచి పోయేందుకు పాలకులు కృషి చేయాలి. అలాగే ఆర్థికంగా అతిపెద్ద చర్యలకు ఉపక్రమించాలి. ప్రధానంగా ఉపాధిరంగాలను విపరీతంగా ప్రోత్సహించాలి. ప్రజలకు అవసరమైతే వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. చిన్నాచి తకా వ్యాపారాలు, ఉపాధి అవకాశాలకు ప్రోత్సాహకాలు ఇవ్వనతవరకు దేశ అర్థికస్థితి కుదుటపడదని గుర్తించాలి. కుదేలవుతున్న రూపాయిని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు కూడా తీసుకోవాలి. చిన్నతరహా పెట్టుబడులతో ఉపాధి అవకాశాలు పెంచుకునేలా బ్యాంకులక స్వేచ్ఛను ఇవ్వాలి. గ్రామీణ ఆర్థికరంగ పురోగామికి తోడ్పడే రంగాల్లో పెట్టుబడులకు అవకాశం ఇవ్వాలి. కులవృత్తులను ప్రోత్సహించాలి. పాడిరంగాన్ని బలోపేతం చేయాలి. కోళ్లు, పశువుల పెంపకం వంటివి విరివిగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా ఉపాధి, ఉద్యోగ రంగాలను బలోపేతం చేస్తే తప్ప ప్రజలకు జీవనభృతి దక్కదు.

దేశంలో దెబ్బతిన్న రంగాలను గుర్తించి ఆదుకోవాలి. ప్రజలకు బతుకలు భారం కాకుండా నిర్ణయాలు తీసుకోవాలి. అందుకు భారీ ప్రణాళికలు చేపట్టాలి. నిర్మాణరంగంలో ఉపాధి అవకాశాలను పెంచాలి. వ్యవసాయరంగంతో పాటు, అనుబంధరంగాలను ప్రోత్సహించాలి. పనులు చేసుకునేలా, ధాన్యం దిగుబడులు పెరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు, దిగుమతులపై ఆంక్షలు విధించాలి. దేవీయంగగా వస్తు వినయోగాన్ని పెంచుకునేలా చైతన్యం తీసుకు రావాలి. అప్పుడే ఉపశమనం లభించగలదు. మెడిసిన్ ధరలతో పాటు ఇతర వస్తువుల ధరలు పెరగకుండా అదుపు చేయగలగాలి. ఇలా ఒక్కోరంగాన్ని ఎంచుకుని దానిని బలోపేతం చేస్తూ పోతే కొంతయినా ఫలితం లభించగలదు.

# అసమాన మేధావి నాగేశ రామచంద్ర

## చింతామణి నాగేశ రామచంద్ర రావు జయంతి




**సి.** ఎన్.ఆర్.రావుగా ప్రసిద్ధిచెందిన చింతామణి నాగేశ రామచంద్ర రావు (జూన్ 30, 1934) భారతీయ శాస్త్రవేత్త. భారతరత్న పురస్కార గ్రహీత. ప్రొఫెసర్ సీఎన్‌ఆర్ రావు రసాయన శాస్త్ర పరిశోధకులు. సాలిడ్ స్టేట్, స్ట్రక్చరల్ కెమిస్ట్రీ విభాగంలో అనేక అంశాలు ఆయన వెలుగులోకి తెచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 60 విశ్వ విద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. సి.వి. రామన్, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంల తరువాత భారతరత్న అవా ర్డుకు ఎంపికైన మూడవ శాస్త్రవేత్త.

ఆయన 1934 జూన్ 30న బెంగళూరులో ఓ కన్నడ భాష మాట్లాడే దేశస్థ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి హనుమంత నాగేశ రావు విద్యాశాఖలో ఉద్యోగి. అమ్మ నాగమ్మ. నాగమ్మ ప్రాథమిక విద్య వరకే చదివినా ఆయనకు ఆమే తొలి గురువు. భారత రామాయణ కథలు, పురందర దాసు కీర్తనలు మొదలైనవి వినిపించేది. నాన్న ఆంగ్లం నేర్పించేవారు.

రామచంద్ర ఉన్నత పాఠశాలలో ఉన్న సమయంలో భారత స్వాతంత్ర్యోద్యమం ఊపందుకుంది. ఆ సమయంలో సుభాష్ చంద్రబోస్ ఆయనకు ఆరాధ్య నాయకులు. నేతాజీ పోరాటాన్ని గురించి మిత్రులకు కథలుగా చెప్పేవారు.పదేళ్ళు నిండక మునుపే లోయర్ సెకండరీ పరీక్షల్లో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణుడయ్యారు. పెద్దయ్యేకొద్దీ స్వాతంత్ర్యోద్యమ తీవ్రత కూడా పెరిగింది. అందుకు గాంధీ టోపీ, ఖద్దరు ధరించారు.

ఉన్నత పాఠశాల విద్య పూర్తయ్యే సరికి భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కానీ మైసూరు సంస్థానం మాత్రం ఇంకా మహారాజుల పాలనలో ఉండేది. దాన్ని భారత్ లో విలీనం చేయాలంటూ పోరాటం మొదలైంది. రామచంద్ర కూడా ఆ ఉద్యమంలో పాల్గొన్నారు. కానీ చదువును మాత్రం నిర్లక్ష్యం చేయలేదు. పదిహేడేళ్ళకే బీయెస్సీ పట్టా అందుకుని మైసూరు విశ్వ విద్యాలయంలో సరికొత్త రికార్డు నెలకొల్పారు.

మైసూరు విశ్వవిద్యాలయం నుంచి 1951లో, ఆయన బీ.ఎస్సీ. డిగ్రీ పుచ్చుకున్న తరువాత కాశీ హిందూ విశ్వ విద్యాలయంలో మాస్టర్స్ చదువు పూర్తి చేసుకొని, 1958లో పర్డ్యూ యూనివర్సిటీలో పి.హెచ్.డి. సాధించి బెంగళూరు లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో లెక్చరర్ గా చేరారు. 1963లో కాన్పూర్ ఐఐటీలో అధ్యాపకునిగా చేరారు. 1984–1994 మధ్య కాలంలో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కి డైరెక్టరుగా పనిచేశారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయం, కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయం, కాలిఫోర్నియా విశ్వ విద్యాలయాలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. "జవహర్ లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్ సైంటిఫిక్ రిసెర్చ్" సంస్థను స్థాపించారు. ఇంకా చాలా ఉన్నత పదవులు నిర్వహించారు.

సాలిడ్ స్టేట్ కెమిస్ట్రీ, మెటీరియల్ సైన్సు రంగాలలో సి.ఎన్. ఆర్. రావు శాస్త్రవేత్తగా ప్రసిద్ధుడ య్యారు. ట్రాన్సిషన్ మెటల్ ఆక్సైడుల గురించి అతని పరిశోధనలు ఆ రంగంలో ముఖ్యమైనవి. నానో పదార్థాల రంగంలో రావు విశేష కృషి చేశారు. 1400 పరిశోధన పత్రాలను వెలువ రించారు. 45 పుస్తకాలు ప్రచురించారు. పద్మశ్రీ, పద్మ విభూషణ్, కర్ణాటక అత్యున్నత పురస్కారం కర్ణాటక రత్న పురస్కారాలను అందుకున్నారు. 2000 సంవత్సరంలో రాయల్ సొసైటీ ఆయనకు హ్యూగ్స్ మెడల్‌ను అందించింది.

2005 నుంచి ప్రధాన మంత్రి శాస్త్రీయ సలహా మండలికి అధిపతిగా ఉన్నారు. ఆయన 1963 నుంచి 1976 వరకూ కాన్పూర్ ఐఐటీలో డీన్‌గా వ్యవహరించారు. 1984 నుంచి పదేళ్ల పాటు ఐఐఎస్‌సీకి సంచాలకులుగా పని చేశారు. సాలిడ్ స్టేట్, స్ట్రక్చరల్ కెమిస్ట్రీ విభాగానికి, పదార్థ పరిశోధన ప్రయోగ శాలకు వ్యవస్థాపక ఛైర్మన్. బెంగళూరులోని జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్ సైంటిఫిక్ రీసెర్చ్‌కు ఆయన వ్యవస్థాపకులు.

1968 – శాంతి స్వరూప్ భట్నాగర్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రైజు, 1974 – పద్మశ్రీ, 1985 – పద్మ విభూషణ్, 2000 – కర్ణాటకరత్న, 2000– హ్యూస్ మెడల్ – రాయల్ సొసైటీ, 2004 – భారత ప్రభుత్వం నుండి ఇండియా సైన్సు అవార్డు పొందిన మొదటి వ్యక్తి. రాయల్ సొసైటీ ఆఫ్ లండన్, అమెరికన్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్, ఫ్రెంచ్ అకాడమీ, జపాన్ అకాడమీ, ఫ్రాన్సు ప్రభుత్వంచే అవార్డులు, 2013లో అత్యున్నత –భారతరత్న అవార్డు పొందారు.



(రామ కిష్టయ్య సంగన భట్ల)
94405 95494

# నగదు బదిలీల పథకాలతో పటిష్ట ఓటు బ్యాంక్


- ఆర్థికస్థితి సహకరించకున్నా డబ్బుల పందేరం
- వచ్చే ఎన్నికలే లక్ష్యంగా పథకాల అమలు
- జగన్ వ్యూహంతో ఆర్థికరంగం కుదేలు





అమరావతి,జూన్29: సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి వివిధ పథకాలతో ప్రజలను ఓటుబ్యాంక్‌గా మార్చుకునే యత్నంలో పడ్డారు. కేవలం తదుపరి అధికారం తమదే కావాలన్న లక్ష్యంతో పథకాలను అమలు చేస్తున్నారు. పటిష్టమైన ఓటు బ్యాంక్‌ను నిర్మించుకోవడమే ఈ పథకాల అమలు వ్యూహమని రాజకీయ విశ్లేషకులు సైతం అంగీకరిస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉన్నప్పటికీ, పథకాల అమలు విషయంలో వెనకడుగు వేయడం లేదు. పక్కావ్యూహంతో ఒక్కో పథకాన్ని అమలు చేస్తున్నారు. ఓ వైపు విపక్ష టిడిపిని దెబ్బతీస్తూ, కేసులతో వారి క్యాడర్‌లో భయాలను పెంచు తున్నారు. మరోవైపు నేతలపై పలు కేసులను నమోదు చేస్తున్న తీరు కేవలం ఓటుబ్యాంకును పదిలం చేసుకునే యత్నాలుగానే చూడాలి. వచ్చే ఏడాది ఎన్నికలకు ఇప్పటి నుంచి కార్యాచరణ మొదలయ్యిందని రాజకీయ విశ్లేషకులు సైతం అంగీకరిస్తున్నారు. తెలుగుదేశం పార్టీని ఇప్పటికే దెబ్బకొట్టిన జగన్ అదే మంత్రంతో ముందుకు సాగుతున్నారు. ఆయా సామాజికవర్గాల మద్దతు తనకు లభించేలా చూస్తున్నారు. హామీల అమలు పేరిట ప్రజాధనాన్ని జగన్మోహన్‌రెడ్డి పంచిపెడుతున్నారనీ ఇప్పటికే విమర్శలు వస్తున్నా జగన్ మాత్రం లెక్క చేయడం లేదు. ఇది క్విడ్‌ప్రో అని ఇప్పటికే మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్ కుమార్ గతంలోనే ఘాటుగానే విమర్శించారు. దీనివల్ల ప్రజలలో తనకు మంచి పేరు వస్తుందన్న ధీమాలో ఆయన ఉన్నారని ప్రచారం. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను గమనించేవారికి పాలనలో పెద్దగా మార్పు కనిపించ కున్నా పథకాల పేరుతో పందేరం సాగుతోందని విమర్శలు వస్తున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉన్నప్పటికీ, పథకాల అమలు విషయంలో వెనకడుగు వేయకపోవడంలో జగన్మోహన్‌రెడ్డికి పక్కా వ్యూహం ఉందని చెబుతున్నారు. ఇందులో ప్రధానంగా డబ్బుల పంపిణీ కార్యక్రమాలకే పెద్దపీట వేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుమతించక పోయినా ప్రజాధనాన్ని పంచిపెట్టే కార్యక్రమాన్ని కొనసాగించాలన్న పట్టుదలలో సిఎం జగన్ ఉన్నారు. దివంగత వైఎస్ కూడా ఇలాగే ప్రజల్లో మంచి పేరు సంపాదించారు. అదే ఆయనను ఉమ్మడి ఎపిలో రెండోసారి అధికారంలోకి తీసుకుని వచ్చింది. అయితే అదేపనిగా ఆయన ఎప్పుడూ డబ్బుల పందేరం చేయలేదు. ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూడా విస్మరించలేదు. అలాగే ఇప్పుడు జగన్ కూడా తండ్రి బాటలో పయనించి ప్రజలలో మంచిపేరు తెచ్చుకోవాలనీ భావిస్తున్నట్లుగా ఉంది. పథకాల అమలుతోపాటు సోషల్ ఇంజనీరింగ్ ద్వారా బలమైన ఓటు బ్యాంకును నిర్మించుకోవడానికి జగన్ పావులు కదుపుతున్నారు. ఉన్నతవర్గాలు తనకు దూరమైనా ఫర్వాలేదనీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు రెడ్డి సామాజికవర్గం అండదండలు దండిగా ఉండేలా పథకాల అమలు కొనసాగు తోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుమతించ కపోయినా ప్రజాధనాన్ని పంచిపెట్టే కార్యక్రమాన్ని కొనసాగించాలనీ, తద్వారా ప్రజలలో మంచి పేరు తెచ్చుకోవాలనీ జగన్ భావిస్తున్నారని అంటున్నారు. మరోవైపు కెసిఆర్ మాయలోపడి తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలు కాపీ కొడుతున్నారనన్న విమర్శలు కూడా ఉన్నాయి. పరిస్థితిని ముఖ్యమంత్రి జగన్ పట్టించుకోవడం లేదనీ సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులను ఇలాగే కొనసాగిస్తూ పోతే జీతాలు చెల్లించడానికి కూడా నిధులు ఉండవనీ అంటున్నారు. ఇప్పటికే కరోనా కారణంగా ఆర్థికస్థితి పూర్తిగా దెబ్బతింది. అయినా పథకాల కోసం నిధుల విడుదల ఆగడం లేదు. ఏ కులాన్ని, మతాన్ని వదలకుండా ఇప్పటి వరకు అన్ని వర్గాలకు ఆర్థికంగా లబ్ది చేకూరేలా కార్యక్రమాలను చేపట్టారు. ఆయా రంగాలను తమ అదుపులో తెచుకునేలా కార్యక్రమాలు సాగుతున్నాయి. అమ్మోడి కావచ్చు, మనే పథకమైనా కావచ్చు..డబ్బుల పంపిణీలో ఆరితేరారు. ఇప్పుడు ఆరోగ్యశ్రీ కింద కూడా నగదు బదిలీకి రంగం సిద్ధం చేస్తున్నారు. దీంతో దుబారాను ఎలా అరికడతారో అర్థం కావడం లేదు.

## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం




"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్ " లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విష యాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.coఎకు పంపవచ్చు.. –ఎడిటర్

# సామాజిక బాధ్యత



అనగా, అనగా, అనగా, ఒకఊళ్ళోఒకసాధువు. ఆ ఊరి చివర ఒక చిన్నకుటీరం వేసుకుని, ఎప్పుడూ భగవంతుని ధ్యానంలో ఉండే వాడు.ఆ కుటీరం చుట్టూ ఆయన ఎంతో అందంగా తులసీవనంని పెంచుకున్నాడు. పొద్దున్నేతెల్లవారుఝామున లేచికాలకృత్యాలుతీర్చుకుని, యోగసాధన చేస్తూ ప్రాణాయామంతో పాటు సూర్యనమస్కారాలు వంటివి చేస్తూ తన ప్రపంచంలో ఉండేవాడు. ఈ సాధువు యొక్క ఆధ్యాత్మిక బోహనాలు వినడానికి చుటూ పక్కల ప్రజలు వీలు దొరికినప్పుడల్లా వస్తుండేవారు. అడిగిన వారందరికీ ఆధ్యాత్మికవిషయాలు, యువకులకు యోగాభ్యాసం వంటివి నేర్పిస్తూ ఉండేవారు. ఆయన కేవలం భక్తులు ఇచ్చిన పాలు, పళ్ళు మాత్రమే ఆహారంగా స్వీకరించేవాడు. అంతే కాక ప్రతీరోజు తనఉద్యానవనంలో స్వయంగా పళ్ళచెట్లు పెంచుతూ ఎంతో శ్రమ పడి వనాన్నిఅందంగా, ప్రేమగా పెంచుకుంటూ, చూసుకునేవాడు.

మధురమైన మామిడిపండ్లు, సపోటాలు, నిమ్మ, దానిమ్మ, జామ, అరటి వంటి అనేక పళ్ళు శ్రద్ధగా పండిస్తూ, ఆ పళ్లనే తానూ రోజూ తింటూ ఎవరి మీద ఆధారపడకుండా, జీవనంసాగిస్తూ ఉండేవాడు. తన కుటీరానికి వచ్చేవారికి కూడా విరివిగా ఫలాలను పంచిపెట్టేవాడు. సహజసిద్ధమైన ఎరువులతో పెంచేవాడు. ప్రతీ రోజు ఆ చెట్ల మధ్యే గడుపుతూ, ధ్యానం చేసుకుంటూ ఉండేవాడు. అన్నీశుద్ధసాత్విక ఆహారం కావటంవాళ్ళ, ఆ సాధువు యొక్కఆలోచనలుకూడా చాలానిర్మలంగా, స్వచ్ఛంగా , ప్రేమతత్వంతో కూడిఉండేవి. అందుకే ఆయన ఎంతో ఆరోగ్యంగా, దృఢమైనశ రీరంకలిగి, మొహం తేజస్సుతో ప్రశాంతంగా ఉండేది. ఆయన ఆశ్రమంలో ప్రవేశించగానే, అందరికీ తెలియని ఒక అలౌకిక ఆనందం కలిగేది. ఈ సాదు మహాత్ముడు కుటీరం దాటి బయటికి సాధారణంగా వెళ్ళేవాడు కాదు. ఆయన అవసరాలు కూడా చాలా తక్కువ. అనారోగ్యంతో వచ్చేవారందికీ కూడా ప్రకృతి వైద్యం చేస్తూ, ఆరోగ్యం చేకూరుస్తూ ఉండేవాడు. ఆయన ఆశ్రమంలో ఎటువంటి విషసర్పాలు, కీటకాలుఉండేవి కావు. ఉన్నా,అవి ఎవరికీ హాని కలిగించకుండా ఉండేవి. ఆ ఊళ్ళో విష్ణుశర్మ అనే బ్రాహ్మణుడికి ఈసాధువు నిత్యానందస్వామీ అంటే ఎంతో గౌరవం. అభిమానం. ప్రతీనిత్యం దర్శనం చేసుకునేవాడు. అల్లకల్లోలంగా ఉన్నతన మనసు ఈస్వామీవారి సమక్షంలో ఆనందమయస్థితికి వెళ్ళేది. తనలో ఎంతో మార్పువచ్చినట్లుగా భావించేవాడు. ఒకనాడు నిత్యానందస్వామి సమీపంలో నిలబడి చేతులుజోడించి, ఎంతో భక్తితో తమ ఇంటికి ఆతిధ్యానికి రావలసినదిగా ప్రాధేయపడ్డాడు. అన్నీ సాత్వికమైన ఆహారపదార్థాలే తయారుచేసి సమర్పించుకుంటాం అని తెలిపాడు. ఈసాధువు అందుకంగీకరించాడు.

అనుకున్నరోజున నిత్యానందస్వామి వారు విష్ణుశర్మ ఇంటికి బయలుదేరి వెళ్ళాడు. తన వెంట ఒకజోలె మాత్రమే తీసుకుని, ప్రశాంతమైన మనసుతో భగవధ్యాసతో, విషుశర్మ ఇల్లు చేరాడు. చక్కటి ఆప్యాయంతో కూడిన ఆతిధ్యం సవీకరించి విష్ణుశర్మకుటుంబాన్నిఆశీర్వదించి తన ఆశ్రమానికి తిరిగి వెళ్ళిపోయాడు.

ఆశ్రమానికి చేరిన ఆయనకి తన జోలె కొంచం బరువుగా ఉన్నట్లు అనిపించింది. ఆ స్వామివారు ఆశ్చర్యపడుతూ, ఆ జోలెలోంచి ఒక వెండిచెంబుని బయటికి తీసారు. తనకే ఆశ్చర్యంవేసింది. ధ్యానంలో వారికి జరిగింది ఏమిటి అన్నది తెలిసింది. నిజానికి ఆలోచిస్తే,ఇది దొంగతనము అవుతుంది కదా? విష్ణుశర్మ తనకి ఈ వెండిచెంబుని, కానుకగాకానీ, దానంగా కానీయివ్వలేదు. వెంటనే స్వామివారు కొంత ఆవేదనతో, తిరిగి విష్ణుశర్మ ఇంటికి వెళ్ళాడు. విష్ణుశర్మ, స్వామివారికి ఏంటో ఆధారంగా లోనికి ఆహ్వానించారు, స్వామి వారు ప్రశాంతంగా కూర్చున్నాక నాయనా, నేను అడిగే ప్రశ్నకి నిజాయితీగా, నిస్సంకోచంగా, నిర్భయంగా సమాధానమివ్వు. నా జోలెలోకి ఈ వెండిపాత్ర ఎలా వచ్చింది. నేను యాంత్రికంగా మంచి నీళ్లు తాగిన చెంబుని, నా జోలెలో వేసుకుని వెళ్లిపోయాను. తెలిసీ తెలియని చేసిన ఈ పనిని అస్తేయము అంటారు. అంటే దొంగతనమే. ఈ రోజు వంట మీఇంట్లో ఎవరుచేశారు? నీభార్యచేయలేదా అనిఅడిగారు. విష్ణుశర్మ ఆశ్చర్యపడి, స్వామీ, మీకు అన్నివిషయాలు తెలుస్తాయి. మీరు చెప్పినట్లు నా భార్య సాత్విక ఆహారాన్నితయారుచేసేటప్పుడు, భగవన్నామస్మ రణ,అన్నపూర్ణస్తోత్రము వంటివి పాడుతూ ఎప్పుడు వస్తారా అని ఆతృతగా ఎదురు చూస్తూండగా ప్రకృతి సిద్ధమైన అడ్డంకి కలిగింది. మైలపడిన ఆమె వంట చేయరాదు. కనుక నాకు దిక్కుతోచక వంటచేసే ఒక బ్రాహ్మణస్త్రీచేత వంట చేయించాను అని భయపడుతూ చెప్పాడు. నిత్యానంద వారు ఆ బ్రాహ్మణస్త్రీని పిలవవలసినదిగాచెప్పాడు. ఈసంగతి విన్నఆమె వినయంగా, భయపడుతూ, స్వామివారి ముందు నిలబడింది. అమ్మా, నిజంచెప్పు.వంట చేసేటప్పుడు నీ మనసులో కలిగిన భావాలుఏమిటి తల్లీ?ఏమని ఆలోచిస్తూచేసావో నిర్భయంగా చెప్పు. నీకు శిక్ష ఏమి ఉండదు అన్నారు.స్వామి. అప్పుడు ఆ బ్రాహ్మణాస్త్రీ భయపడుతూ నన్నుక్షమించండి నేనుపేదరాలను. ఎప్పటి నుంచో నాకు ఒకవెండి చెంబు కొనుక్కోవాలని ఆశఉంది. వంట చేస్తున్ననాకు ఆలోచనలన్నీకూడా ఆ వెండిచెంబు మీద మాత్రమే ఉంది. ఎలాగైనా సరే తస్కరించాలని భావించాను. కానీ వీలు కుదరలేదు. దయచేసినన్నుక్షమించండి అనగానే, సరే.యింకా నీవు వెళ్ళవచ్చు అని క్షమించి, పంపించేశారు. ఈ విషయాన్నితెలుసుకున్నచుట్టూపక్కల వారు స్వామి వారున్న ప్రదేశానికి రావటం జరిగింది. అందరూ అసలు విషయం వివరంగాతెలుసుకోవాలన్నఆసక్తితో, ధైర్యంచేసి ఆ స్వామివారిని అడిగారు. అందుకు సమాధానంగా స్వామివారు ఇలా చెప్పారు. మనం తీసుకున్న ఆహారసం తోటె మన మనసూ ఆలోచనలు తయారవుతాయని మన మహర్షులు ఏనాడోచెప్పారు.

మన కడుపు అనేపాత్ర పరిశుద్ధంగా లేనపుడు మనం తీసుకున్నఆహారం,మంచేదైనా కలుషితమవుతుంది. ఇది తిన్నఆహారం విషపూ రితంగా మారి, తామసిక భావులుగా మారతాయి. ముఖ్యంగా భావశుద్ధి, స్థలశుద్ధి, పాత్రశుద్ధి, భూతశుద్ధి, ద్రవ్యశుద్ధి వంటివి తప్పక ఉండాలి. మహర్షులు మనందరం కూడా అహం బ్రహ్మ అంటే, మనందరిలో ఉన్నది ఆ పరబ్రహ్మమే అని చెప్పారు. కాబట్టి ఈతత్వాన్ని ఎవరైతే పూర్తిగా తెలుసుకుం టారో,వారికి ఎదుటి వారి భావాలన్నీతెలు స్తుంటాయి. సాత్వికపదార్థాలు అంటే శాకాహారం తిన్నప్పుడు,మన ఆలోచనలు కూడా సాత్వికంగా, నిర్మలంగా ఉంటాయి. వాక్శుద్ధి త్రం చాలా బావుంటుంది. మాట మృదువుగా ఉంటుంది. రాజసికమైన పదార్థాలు, అంటే ఘాటైన దినుసులు, కారాలు, ఇత్యాదులు తిన్నప్పుడు మనమ నసులోని ఆలోచనలు, అహంకారపూరితమై, అధికారదర్పం, కలిగి వాక్కు కఠినంగా మారుతుంది. వంట చేసిన స్త్రీ యొక్క ఆలోచనలు రాజసిక, తామసిక గుణాలతో ఉన్నాయి. కాబట్టి, ఆమె యొక్క ఆలోచనలు నాయొక్క సాత్వికక్షేత్రాన్ని కలుషితంచేశాయి. అందుకని, నేను అనాలోచితంగానే,ఈ వెండి చెంబుని నా జోలెలో వేసుకుని, వెళ్ళిపో యాను, అని చాలా వివరంగా, విపులంగాచెప్పారు. అందుకే మన పెద్దలు సజ్జన సాంగత్యం మాత్రమే చేయాలని చెప్తారు. తల్లివంటి సాత్వికమైన శాకాహారాన్నిభుజిస్తే, ఆరోగ్యంతోపాటు, మంచి భావాలు కూడా కలుగుతాయి.మనకి శాకాహారంలో శరీరానికి కావలసిన అన్ని రకాల పోషక పదార్థాలు లభిస్తాయి. పిల్లలూచూసారా. ఆహారం మనఆలోచనలకీ, ఆరోగ్యానికీ, తెలివితేటలకీ, చురుకుదనానికీ ఏవిధంగా ఉపయోగపడుతుందో తెలుసుకోవాలి. ఆహారమేమనసవుతుందిమరి.

**మంత్రిప్రగడమార్కండేయులు,**
**హైదరాబాద్, 9951038802**

## రాజీవ్ యూత్ ఆన్లైన్ క్విజ్ లో యువత చురుగ్గా పాల్గొనాలి

### నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి ఆదరి రాజేందర్



భీమదేవరపల్లి జూన్ 29 (ప్రజామంటలు): జులై 2న నిర్వహించ బోయే రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ లో యువత చురుగ్గా పాల్గొనాలని ఆదరి రాజేందర్ అన్నారు. ముల్కనూర్ లోని పలు కళాశాలలలో యుత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు విద్యార్థులకు క్విజ్ గురించి తెలియజేస్తారని అన్నారు. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా, తెలంగాణ నిరుద్యోగ యువతీ యువకులలో స్ఫూర్తిని పెంపొందించేందుకు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆన్లైన్ క్విజ్ పోటీలలో పాల్గొనేందుకు 7661899899 నెంబర్ కు మిస్డ్ కాల్ ఇచ్చి పేరును రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ గుడికందుల రాజు, మాడుగుల చింటు, రారాజు, వెంకటేష్, శ్రీను, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆటో యూనియన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన లోకిని తిరుపతి



ఎల్కతుర్తి జూన్ 29 (ప్రజామంటలు): ఎల్కతుర్తి మండలం ఆటో యూనియన్ నూతన కమిటీ అధ్యక్షులుగా లోకిని తిరుపతి, ఉపాధ్యక్షులు జంగం సురేష్, ప్రధాన కార్యదర్శి జంగం రాజు, కోశాధికారిగా అంబాల మహేష్, ప్రచార కార్యదర్శి సాయి కృష్ణ, కమిటీ మెంబర్స్ ఏ. సతీష్, ఎండి. నసూర్, కె. రాజు, జి. సాంబరాజు, గౌరవ అధ్యక్షులు కొన్నే దేవేందర్ రెడ్డి, ముఖ్య సలహాదారులుగా బొజ్జ శ్రీధర్, వెంకటేష్ యాదవ్, ఆటో యూనియన్ తదితరులు పాల్గొన్నారు.

## రూ. 5 లక్షల ఎల్ఓసిజ అందజేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



రాయికల్ జూన్ 29 (ప్రజామంటలు): రాయికల్ మండల మహితాపూర్ గ్రామానికి చెందిన రాయి వెంకటేష్ తండ్రి భీమలింగం వెన్నెముక సమస్య తో భాదపడుతూ ఉండగా స్థానిక నాయకులు మాజీ ఏఎంసి చైర్మెన్ గన్నే రాజీ రెడ్డి, ఇట్టి విషయాన్ని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఎమ్మెల్యే. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నిమ్స్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స నిమిత్తం 5లక్షల రూపాయల ఎల్ఓసి ని వెంకటేష్ కుటుంబ సభ్యులకు జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్ లో అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. ఎల్ఓసి మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కు వెంకటేష్ కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోర వెంకటేష్, మహేష్, రత్నాకర్ రావు, స్పందన, తదితరులు పాల్గొన్నారు.

## మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బిజెపి

### కాశితుర్క కాలనీలో మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి



భీమదేవరపల్లి జూన్ 29 (ప్రజామంటలు): కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజలను విభజిస్తుందని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి అన్నారు. బక్రీద్ సందర్భంగా ప్రవీణ్ రెడ్డి గురువారం కాశ తుర్క కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకమత్యంగా ఉన్న భారత దేశంలో మత చిచ్చుపెట్టి ఐక్యంగా ఉన్న దేశ ప్రజలను బీజేపీ విడదీస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ రెడ్డితో పాటుగా మాజీ పీసీసీ సభ్యులు చిట్టంపల్లి అయిల య్య, మాజీ మండల అధ్యక్షులు కేతిరి లక్ష్మా రెడ్డి, జీమ్మాల భీంరెడ్డి, ఆర్. వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, మంగ రామచంద్రం, చేవల్ల బుచ్చయ్య, చిట్టి సతీష్ రెడ్డి, మల్లారెడ్డి, రంగయ్య, తిరుపతి రెడ్డి, వలీ, గ్రామ శాఖ అధ్యక్షులు మౌలానా, వల్లాల రమేష్, బందయ్య, చుక్కయ్య, సయ్యద్ బాషా, చిన్న ఆలి, చిన్న హుస్సేన్, జహంగీర్, ఇస్మాయిల్, చిన్న మౌలానా, సంజీవ్ తదితరులున్నారు.

# జన హృదయాలలో సాయిచంద్

## పాట పదిలం

జనగామ జూన్ 29 (ప్రజామంటలు): మలి దశ తెలంగాణ ఉద్యమంలో కవులు కళాకారుల పాత్ర అమోఘం, అనిర్వచనీయం, అందులో సాయిచంద్ సబ్బండ వర్గాలను సాయిత చేసి ఆంధ్ర వలసవాదులను తరిమి కొట్టి స్వరాష్ట్ర కల నెరవేర్చుటలో జనరంజక పాటలతో పదునైన పాటల ప్రశ్నల వర్షం కురిపించిన అగ్ర శ్రేణి గాయకులలో తన గళం అద్భుతం. జనం నాడీకి తన జాన పదంతో దోస్తీ చేసుకొని

జై బోలో తెలంగాణ.

(అందెశ్రీ రాసిన పాట) అంటూ పాటల నిప్పు కణికల్ని పుక్కిట పట్టిన వ్యక్తి, రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా రక్త బంధం విలువ నీకు తెలియదురా (మిట్టపల్లి సురేందర్ రాసిన పాట) అని తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరుల తల్లుల కడుపుకోతను పాట ద్వారా వినిపించాడు, మాట ద్వారా ఓదార్పు నిచ్చాడు, మరెందరో రాసిన పాటలను, తాను రాసుకున్న పాటలను, స్వీయ సంగీత నేపథ్యంలో పాడిన పాటలను తన వంతు కర్తవ్యంగా తెలంగాణ ఉద్యమంలో ఏ కార్యక్రమమైనా తన పాట తోనే షురూ చేసే స్థాయిని సంపాదించుకున్నాడు. వెన్నెలకు వచ్చినాయి జొన్నల బండ్లో నగాదారిలో అని అన్నా చెల్లెళ్ల మధ్య ఉండే ప్రేమను పాట రూపంలో వర్ణించినా..

### సై సై సై మేడారం జాతర అంటూ....

సమ్మక్క సారక్కల వీరోచిత పోరాటాలను, త్యాగాలను వర్ణించినా అది సాయి చంద్ కు మాత్రమే చెల్లుతుంది. తన పాటల ద్వారా వేలాది మంది హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకున్న నిఖార్సైన తెలంగాణ వాగ్గేయకారుడు సాయిచంద్.

ఉద్యమ ఆకాంక్ష నెరవేరిన తర్వాత రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు చైర్మన్ గా బాధ్యతలు చేపట్టి తాను నమ్ముకున్న జానపదాన్ని ప్రాణప్రదంగా చూసుకున్నాడు. దళిత బహుజన వాదం, అంబేద్కర్ ఆలోచనా విధానంలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వ్యక్తి, తెలంగాణ జానపద పాటల సమూహ శక్తి, నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన వ్యక్తి సాయిచంద్ అకాల మరణం బాధాకరం. భౌతికంగా సాయిచంద్ మనకు దూరమైనా తాను పాడిన పాటలు పల్లె ప్రజల గుండెల్లోనే కాదు, గల్లీ నుండి ఢిల్లీ దాకా, తెలుగు ప్రజలకు, ప్రత్యేకించి తెలంగాణ ప్రజల గుండెల్లో పారాడుతుంటాయి. పాట రాసిన వారు, పాడినవారు, గజ్జె కట్టి గంతేసి డప్పుల చప్పుళ్ళతో జనాన్ని ఉర్రూతలూగించే ప్రతి కళాకారుడికి గౌరవం దక్కుతుంది.

### ఆ ఘనత సాయి చంద్ కు దక్కింది ....

నేడు యావత్ తెలంగాణ ప్రజానీకం సాయిచంద్ మరణ వార్త విని ఎందరో పలు సామాజిక మాధ్యమాల్లో తనను గుర్తు చేసుకుంటున్నారంటే వెల కట్టలేని అభిమానం, పదునైన పాటలతో, మృధువైన మాటలతో అందరికీ దగ్గరయ్యాడు. అందరిలో ఉద్యమ స్ఫూర్తి నింపారు. స్వర భాస్వరమై నిలిచాడు.ఏదీ ఏమైనా సాయి చంద్ అకాల మరణం నమ్మశక్యం కావడం లేదు. కానీ, ఇది నమ్మలేని చేదు నిజం. తన పాటతో ఉద్యమానికి ఊపిరి పోసి అందనంత దూరాలకు వెళ్లిపోయిన ఉద్యమ గళానికి నివాళులు అర్పిస్తున్నా......

**దళితరత్న, కళాశ్రీ, సౌరం ప్రవీణ్ కుమార్**

# జూలై 1న టీ.ఎస్.పి.ఎస్.సి. గ్రూప్-4 రాత పరీక్ష

- షూ వేసుకుని పరీక్షా కేంద్రానికి రావద్దు
- గ్రూప్-4 వ్రాత పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు
- జిల్లాలో మొత్తం 73 పరీక్ష కేంద్రాలు
- జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్




జగిత్యాల జూన్ 29 (ప్రజామంటలు): గ్రూప్-4 రాత పరీక్ష కు సంబంధించి జిల్లాలో మొత్తం 73 పరీక్ష కేంద్రాలు ఉన్నాయని ఈ యొక్క పరీక్ష కేంద్రాల వద్ద కేంద్రాల వద్ద 01-07-2023 ఉదయం 06:00 నుండి సాయంత్రం 6:00 గం. వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని మరియు పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్, ఇంటర్ నెట్ సెంటర్స్, మరియు చుట్టుపక్కల లౌడ్ స్పీకర్లు, మూసి వేయాలని, మరియు పరీక్ష సెంటర్స్ వద్ద నుండి 100 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దని ఎస్పీ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు పరీక్షా సమయాని కంటే 2 గంటల ముందే కేంద్రానికి చేరుకోవాలని, మానసికంగా ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు.

జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల వివరాలు:

మెట్ పల్లి-11, కోరుట్ల -20, రాయికల్ -04, జగిత్యాల టౌన్-27, జగిత్యాల రూరల్-07మల్యాల-02, కొడిమ్యాల-01, గొల్లపల్లి -01 మొత్తం: 73 పరీక్ష కేంద్రాలు జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగింది.

గ్రూప్-4 పరీక్ష వ్రాసే అభ్యర్థులకు సూచనలు: పరీక్షల సమయాలు పేపర్ -1 ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, పేపర్ - 2 మధ్యాహ్నం 2:30 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు నిర్వహించబడుతుందని చివరి నిమిషంలో వచ్చి ఇబ్బంది పడకుండా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అభ్యర్థులకు సూచించారు.

పరీక్షా కేంద్రంలోకి బ్యాగులు, సెల్ ఫోన్లు, స్మార్ట్ ఫోన్లు, వాచ్ లు, క్యాలిక్యులేటర్లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరు. చెప్పులు మాత్రమే వేసుకొని రావాలి. షూ వేసుకుని పరీక్షా కేంద్రానికి రావద్దని, అభ్యర్థులను మెటల్ డిటెక్టివ్ ద్వార పరిశీలించి పరీక్షా కేంద్రం లోనికి పంపించడం జరుగుతుంది.

# ఎట్టకేలకు గాంధీ పేషంట్లకు రూ. 80 ల భోజనం

- ఏడాదిన్నర కాలంగా పెండింగ్ లో కొత్త డైట్ రేటు
- వరస కోర్టు కేసులతో అమలుకు నోచుకోని కొత్త రేటు
- రెండోసారి టెండర్ తో వీడిన చిక్కుముడి
- నేటి నుంచి డైట్ నిర్వహణ కొత్త కాంట్రాక్ట్ కంపెనికి



సికింద్రాబాద్ జూన్ 29 (ప్రజామంటలు): ఎట్టకేలకు గాంధీ ఆసుపత్రి డైట్ క్యాంటీన్ టెండర్ ప్రక్రియ చిక్కుముడి వీడింది. గత ఏడాదిన్నర కాలంగా ప్రభుత్వం పెంచిన కొత్త డైట్ ఛార్జీలు వరస కోర్టు కేసులతో పెండింగ్ లో ఉండగా, చివరికి రెండో సారి నిర్వహించిన డైట్ టెండర్ ప్రక్రియ కోర్టు, ప్రభుత్వ జోక్యంతో ముగిసింది. నేటి నుంచి గాంధీ ఆసుపత్రి పేషంట్లకు, డ్యూటీ డాక్టర్లకు కొత్త డైట్ ఛార్జీలు కలిగిన ఫుడ్డు సప్లయి కానుంది. వివరాలు ఇవి..గాంధీ ఆసుపత్రిలో ఇన్పేషంట్లుగా ట్రీట్మెంట్ పొందుతున్న రోగులతో పాటు డ్యూటీ డాక్టర్లకు డైట్ క్యాంటీన్ ద్వారా నిత్యం ఫుడ్డును అందిస్తుంటారు. పేషంట్లకు రూ 40, డాక్టర్లకు రూ. 80 ల ఫుడ్డును ఇస్తుండగా, పేషంట్లకు మరింత నాణ్యమైన ఫుడ్డును అందించాలనే ఉద్దేశ్యంతో గత ఏడాది ఏప్రిల్ నెలలో ప్రభుత్వం డైట్ ఛార్జీలను డబుల్ చేసింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కొత్తగా డైట్ టెండర్లు నిర్వహించాలని చెబుతూ, పేషంట్లకు రూ 80, డాక్టర్లకు రూ 160 కి పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటికే ఉన్న పాత కాంట్రాక్టర్ కొత్త టెండర్ల నిర్వహణపై కోర్టుకు వెళ్లడంతో ఇన్నాళ్ళు గాంధీ ఆసుపత్రిలో పెంచిన డైట్ ఛార్జీలు అమలు కాలేదు. ఇటీవల అధికారులు తిరిగి రెండోసారి టెండర్ నిర్వహించగా, మళ్ళీ డైట్ క్యాంటీన్ నిర్వాహకులు కోర్టుకు వెళ్లారు. గాంధీ ఆసుపత్రిని దృష్టిలో ఉంచుకొని పెంచిన డైట్ ఛార్జీలు చివరికి గాంధీలోనే అమలు కావడం లేదని గ్రహించిన ప్రభుత్వం అన్ని లీగల్ లిటిగేషన్లను పరిష్కరించింది. కోర్టు ఆదేశాలతో స్టేట్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, జిల్లా డైట్ కమిటీ చైర్మన్ శ్వేతామహంతి ఆధ్వర్యంలో టెండర్ బాక్సులు తెరిచారు. టెండర్ వేసిన ఆరుగురు కాంట్రాక్టర్లు ఫైనాన్స్ బిడ్ లో కూడ క్వాలిఫై కావడంతో డ్రా తీయగా, శ్రీవెంకటేశ్వర్ అసోసియేషన్ కాంట్రాక్టర్ రవికుమార్ కు టెండర్ దక్కింది. గురువారం గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొ.రాజారావు డైట్ కొత్త కాంట్రాక్టర్ రవికుమార్ కు ఆర్డర్ కాపీ అందచేశారు. ఈ కార్యక్రమంలో గాంధీ ఏడీ ఫ్లోరెన్స్ మెర్లిన్, ఆర్ఎంవో లు డా. వెంకటరమణ, డా. రాము, చీఫ్ డైటీషియన్ రమేశ్ ఉన్నారు. శుక్రవారం నుంచి కొత్త ఛార్జీలు కలిగిన ఫుడ్డును పేషంట్లకు, డాక్టర్ల కు అందచేయనున్నారు.

## గ్రూప్ 4 పరీక్ష రాసే వారి కోసం జగిత్యాల డిపో నుండి ప్రత్యేక బస్సులు

### బస్టాండ్ వద్ద ప్రత్యేక సమాచార కేంద్రం

40 మంది అభ్యర్థులు ఉన్నచో పరీక్ష సెంటర్ వరకు బస్సు సౌకర్యం



జగిత్యాల జూన్ 29 (ప్రజామంటలు): ఆదివారం రోజు జరగబోవు గ్రూప్ 4 పరీక్షలకు హాజరగు అభ్యర్థులకు జగిత్యాల డిపో నుండి ప్రత్యేక బస్సులు నడపబడుచున్నాము కావున పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులందరూ ఇట్టి అవకాశమును ఉపయోగించుకోవాల్సిందిగా జగిత్యాల డిపో మేనేజర్ తెలిపారు. అలాగే ఏదేని గ్రామం లేదా వాడ నుండి 40 మంది అభ్యర్థులు ఉన్నచో పరీక్ష సెంటర్ వరకు బస్సు సౌకర్యం కల్పించబడును. కావున ఇట్టి అవకాశాన్ని అభ్యర్థులందరూ ఉపయోగించుకోవాలని డిపో మేనేజర్ బి. వెంకట నరసప్ప అభ్యర్థుల కొరకు బస్టాండ్ వద్ద ప్రత్యేక సమాచార కేంద్రం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## గ్రూప్-4 పరీక్షల దృష్ట్యా సమాచార కేంద్రం ఏర్పాటు



కోరుట్లటౌన్ జూన్ 29 (ప్రజామంటలు): శనివారం గ్రూప్ - 4 పరీక్షలు జరుగుతున్నందున కోరుట్లలో 19 సెంటర్లలో పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. కావున మన కోరుట్ల బస్టాండ్ నుండి ఉదయం బయలుదేరిన పల్లె వెలుగు బస్సులు 9.00 గంటల వరకు బస్టాండ్ కు చేరుకునే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందని అలాగే కోరుట్ల బస్టాండ్ లో ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమాచార కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా బస్సులు నడపబడును. పట్టణ పరిసర గ్రామాల ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుట్ల డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మి ఒక ప్రకటనలో కోరారు.

**బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని జగిత్యాల పట్టణములోని పురాతన ఖిల్లా వద్ద ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలో పాల్గొని ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. వెంట మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పట్టణ బిఆర్ఎస్, మైనార్టీ నాయకులు ఉన్నారు.**



## చలో చేర్యాల్



నర్మెట్ట జూన్ 29 (ప్రజామంటలు): బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజు నాయక్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. అనంతరం మండల అధ్యక్షుడు ధరవత్ రాజు నాయక్ మాట్లాడుతూ.... మహాజన సంపర్క్ అభియాన్ లో భాగంగా జనగామ అసెంబ్లీ నియోజకవర్గ నవ సంకల్ప బహిరంగ సభ చేర్యాల లో నేడు కళ్యాణి గార్డెన్లో ఉదయం 11 గంటలకు జరుగుతుంది. ముఖ్య అతిథిగా బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విచ్చేస్తున్నారు. నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయవలసిందిగా కోరుచున్నాను. ఈ కార్యక్రమంలో ముదికొండ ప్రభాకర్, బీజేవైఎం మండల కార్యదర్శి బైకన్ రంజిత్, రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

## జనగామలో సాయి చందు మృతి కవులు, కళాకారుల నివాళులు



జనగామ జూన్ 29 (ప్రజామంటలు): తెలంగాణ ఉద్యమ నాయకుడు, తెలంగాణ గిడ్డంగుల చైర్మన్ సాయి చందు అకాల మరణానికి చింతిస్తూ తెలంగాణ సాంస్కృతిక సారధి జనగామ జిల్లా అధ్యక్షులు గట్టగల్ల సంజీవ ఆధ్వర్యంలో గురువారం జనగామ జిల్లా కవులు, కళాకారులు జనగామ అంబేద్కర్ చౌరస్తా వద్ద తన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి మాట్లాడుతూ.... సాయిచంద్ మరణం కళారంగానికి తీరని లోటని అన్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా సాయిచంద్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు డా. జేరిపోతుల పరశురామ్ మాట్లాడుతూ.... సాయిచంద్ అంత్యక్రియలు ప్రభుత్వలాంచనలతో చేయాలని, అమరవీరుల స్తూపం వద్ద సాయిచంద్ పోటో పెట్టాలని అన్నారు. కవులు కళాకారుల ఐక్యవేదిక కన్వీనర్ జి. కృష్ణ మాట్లాడుతూ.... ప్రభుత్వం కవులకు కళాకారులకు ప్రత్యేకంగా సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారధి జనగామ జిల్లా అధ్యక్షులు గట్టగల్ల సంజీవ,జనగామ రచయితల సంఘం అధ్యక్షులు అయిలా సోమనర్సింహచారి, కవి హృదయం సాహిత్య వేదిక వ్యవస్థాపకులు పెట్లోజు సోమేశ్వరాచారి, పిట్టల కుమార్, విశ్వ బ్రహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు నారోజు రామేశ్వరచారి, పిట్టల కుమార్, కళాకారులు బెజ్జారి చందు, ఇరుగు రాజు, మంగ రామకృష్ణ, గడ్డం జెమిని, డప్పు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## బీరప్ప దేవునికి బోనాల సమర్పణ, ప్రత్యేక పూజలు



జనగామ జూన్ 29 (ప్రజామంటలు): జనగామ జిల్లా కేంద్రంలోని కురుమ కులస్థుల కుల దైవం బీరప్ప దేవునికి బోనాల పండుగ సంధర్భంగా బీరప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు గురువారం నిర్వహించారు. కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు కంచ రాములు, కురుమ సంఘం రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షులు ఆలేటి రాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్నం నర్సింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి జాయ మల్లేశ్, జిల్లా ఉపాధ్యక్షులు ఆలేటి సిద్దిరాములు, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి బొరెల్లి సిద్దులు, బాల్దే ఆంజనేయులు, మోటే దేవేందర్, పట్టణ అధ్యక్షులు బాల్దే మల్లేషం, కోశాధికారి కేమిడి ఉపేందర్, దయ్యాల శ్రీను, యూత్ జిల్లా నాయకులు నోముల మహేశ్, సానిక శ్రీను, బెజాడి హరీష్, మంగ శ్రీశైలం, జూకంటి మధు, కర్రే రాములు, బాల్దే యోగేష్, మోటే శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉద్యమ, గాయకుడు సాయిచంద్ మరణం తీరని లోటు

జగిత్యాల జూన్ 29 (ప్రజామంటలు): తెలంగాణ ఉద్యమ కెరటం, ప్రజా గాయకుడు సాయిచందు మరణం తెలంగాణ కళా రంగానికి తీరని లోటని జగిత్యాల కళాకారులు అన్నారు. కళాశ్రీ అధినేత గుండేటి రాజు ఆధ్వర్యంలో కళాకారులు సాయి చందు మృతి పట్ల సంతాపం తెలిపారు. ఈ సందర్బంగా కళాశ్రీ అధినేత గుండేటి రాజు మాట్లాడుతూ.... తెలంగాణ ఉద్యమంలో తన పాటలతో ప్రజలను ఉత్తేజ పరచిన గొప్ప గాయకుడని, నేడు తెలంగాణ ప్రభుత్వంలో గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ చైర్మన్ గా కొనసాగుతున్న తరణములో ఇలా జరగడం బాధాకరమన్నారు. యావత్తు తెలంగాణ ప్రజానీకాన్ని బాధలో ము%శీ%చ్చెత్తిన సాయిచంద్ మన మధ్యలో భౌతికముగా లేకున్న పాట రూపంలో నిలిచి చిరంజీవిగా ఉంటాడన్నారు. కళాశ్రీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో రెండు నిమిషాలు మౌనం వహించి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గాన కోకిల ఎలిగేటి రాజేంద్రప్రసాద్, జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, ఎలుగందుల రవి, బండారి వెంకటేశ్వర్లు, గొల్లపెల్లి శ్రీరాములు గౌడ్, కొమురవెల్లి లక్ష్మీనారాయణ, గాయకుడు అభి, బద్రి శ్రీరాములు పాల్గొన్నారు.

## నెల్లుట్ల సర్పంచ్ చిట్ల స్వరూప ను అభినందించిన శ్రీనివాస నగర్ కాలనీ వాసులు



జనగామ జూన్ 29 (ప్రజామంటలు): జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం నెల్లుట్ల శ్రీనివాస్ నగర్ కాలనీ వాసులు. ఇటీవల ఐఎస్ఓ అంతర్జాతీయ అవార్డ్ అందుకున్న గ్రామ సర్పంచ్ చిట్ల స్వరూప భూపాల్ రెడ్డి ని గురువారం అభినందించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కాలనీలో పేరుకొని ఉన్న సమస్యలు తెలిపారు. క్రింది భాగంలో సీసీ రోడ్ల నిర్మాణం, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, మిషన్ భగీరథ వాటర్ సప్లయ్, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ విస్తరణ, వీధి లైట్ల అమరిక సమస్యలు దృష్టికి తేగా త్వరలోనే శంఖుస్థాపన చేస్తామని సర్పంచ్ స్పష్టమైన హామీ ఇచ్చారు. అభినందించిన వారిలో నెల్లుట్ల శ్రీనివాస నగర్ కాలనీ అధ్యక్షులు గంగరాజు శ్రీనివాస రావు, ఉపాధ్యక్షులు దొర్నాల మనోహరస్వామి, కోశాధికారి పొట్టబత్తిని భాస్కర్, కాల్వ జగపాల్ రెడ్డి, చెట్టిపల్లి నరేందర్ రెడ్డి ఉన్నారు.

## మృతిరాలి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ కడియం శ్రీహరి



వేలేరు జూన్ 29 (ప్రజామంటలు): మండలంలోని మల్లికుదుర్ల గ్రామానికి చెందిన బట్టు మోయినమ్మ ఇటీవల మరణించగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సందర్శించి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోదల రాజిరెడ్డి, బొజ్జ రవీందర్ యాదవ్, ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, గ్రామస్తులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## కన్నారం గ్రామం అక్కన్నపేట్ మండలంలో విలీనం

### ఎంఎల్ఏ కు కృతజ్ఞతలు తెలిపిన జెడ్.పి.టి.సి. భూక్యా మంగా శ్రీనివాస్



అక్కన్నపేట్ జూన్ 29 (ప్రజామంటలు): ప్రజల కోరిక మేరకు మండలాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా హన్మకొండ జిల్లా వేలేరు మండలంలో ఉన్న కన్నారం గ్రామాన్ని సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ కి సహకరించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అక్కన్నపేట్ జెడ్.పి.టి.సి. భూక్యా మంగా శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట్ ఎంపిపి గుగులోతు లక్ష్మి, కన్నారం సర్పంచ్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వాసానికి కరుణ, ఐక్యతకు ప్రతీక బక్రీద్

### తేనేటి విందులో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇందిర



వేలేరు జూన్ 29 (ప్రజామంటలు): మండల కేంద్రంలోని ఉప సర్పంచ్, కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షులు సద్దాం హుస్సేన్ ఆహ్వానం మేరకు బక్రీద్ ఈద్–ఉల్–ఆదా కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి స్టేషన్ ఘనపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సింగపురం ఇందిర హాజరయ్యారు. సింగపురం ఇందిర మాట్లాడుతూ.... విశ్వాసానికి కరుణ, ఐక్యతకు ప్రతీక బక్రీద్ పండుగ అని దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ.. ఈ పండుగ జరుపుకొంటారన్నారు. భక్తి భావం, విశ్వాసం, కరుణ, ఐక్యతకు సంకేతమైన ఈ పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకుంటారన్నారు. ఈ పండుగ సోదర భావం, ఐక్యతకు ఆదర్శంగా నిలుస్తుంది" అని అన్నారు. అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని అభిలషించారు. ఈ పండుగ అందరి జీవితాల్లో సరికొత్త వెలుగు నింపాలని ఆకాక్షించారు. బక్రీద్ పండుగ భక్తి, త్యాగం, కరుణ, విశ్వాసం అనే గొప్ప గుణాలను ప్రజల్లో పెంపొందిస్తుందని ముస్లిం సోదరి, సోదరీమణులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబెర్ లు, జిల్లా నాయకులు,మండల అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యువజన నాయకులు, సీనియర్ నాయకులు,మండల ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ ఉద్యమ అగ్రనేత అంబటి ఆంజనేయులుకు నివాళులు



తాడేపల్లిగూడెం జూన్ 29 (ప్రజామంటలు): వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమం కోసం అంబటి ఆంజనేయులు సాగించిన నిరంతర కృషిని స్ఫూర్తిగా తీసుకుని సమస్యల పరిష్కారం కోసం యువ జర్నలిస్టులు పోరాడాలని ఐ.జే.యు. జాతీయకార్యదర్శి డి. సోమసుందర్ కోరారు. ఇటీవల కన్నుమూసిన ఐజేయు జాతీయ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఏపీయూడబ్ల్యూజే సీనియర్ నేత అంబటి ఆంజనేయులు సంతాప సభ గురువారం తాడేపల్లిగూడెం మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిక్కాల రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఐజేయూ జాతీయకార్యదర్శి డి. సోమసుందర్ మాట్లాడుతూ.... ఐదు దశాబ్దాలపాటు వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమం కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన అంబటి ఆంజనేయులు మృతి చెందడం రాష్ట్ర జర్నలిస్టు ఉద్యమానికి తీరని లోటని అన్నారు. హైదరాబాద్, విజయవాడ వంటి కేంద్రాలకు మాత్రమే పరిమితమైన జర్నలిస్టుసంఘాన్ని జిల్లాలకు, గ్రామీణ ప్రాంతాలకు విస్తరింపచేయడంలో అంబటి గట్టి కృషిచేశారన్నారు. వారి కృషితోనే గ్రామీణ జర్నలిస్టులకు కొన్నయినా సదుపాయాలు వచ్చాయన్నారు. సంపాదకులకు, యాజమాన్యాలకు, జర్నలిస్టులకు మధ్య వారధిగా ఆయన నిలిచి సమస్యల పరిష్కారం కోసం కృషి చేసారన్నారు. పశ్చిమగోదావరి జిల్లా వర్కింగ్ జర్నలిస్ట్ ఉద్యమానికి ఎంతగానో తోడ్పాటు ఇచ్చారన్నారు. ఏ.పి.యు.డబ్ల్యు.జే. జిల్లా కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ గజపతి వరప్రసాద్ మాట్లాడుతూ జర్నలిస్టుల వృత్తిపరమైన హక్కులకోసం,సమస్యల పరిష్కారం కోసం అంబటి ఆంజనేయులు గట్టిగా పోరాటం చేశారని అన్నారు. రాష్ట్రం లోని జర్నలిస్టులకు విజయవాడలో ఏపనివున్నా తానున్నానంటూ అండగా వచ్చి సహకరించే గొప్ప మానవతావాది అంబటి ఆంజనేయులు అని కొనియాడారు. రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ ఉద్యమం ఒక పెద్ద దిక్కును కోల్పోయిందని అన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిక్కాల రామకృష్ణ మాట్లాడుతూ.... రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ ఉద్యమానికి అంబటి ఆంజనేయులు ఒక మూలస్తంభం వంటివారని , ఎందరో జర్నలిస్టులకు వ్యక్తిగతంగా అండగా నిలిచారని , సమస్యలు ఎక్కు వగా పేరుకుపోయిన ప్రస్తుత పరిస్థితుల్లో అంబటి వంటి సీనియర్ నేతను కోల్పోవడం యూనియన్ కు తీరనిలోటని పేర్కొన్నారు. వారి ఆశయాల సాధనకు కృషిచేయడమే అంబటి కి అర్పించే నిజమైన నివాళి అవుతుందని రామకృష్ణ అన్నారు. సీనియర్ పాత్రికేయులు తేతలి గంగాధర రెడ్డి , ఏ.వి. రామరాజు, తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు కొడమంచిలి ఆశీర్వాదరావు, ఎలక్ట్రానిక్ మీడియా నాయకులు పి. సతీష్, కొండేటి ఆనంద్ కుమార్, మార్లపూడి ఏసు, బాసం శెట్టి బాలబాలాజీ, రొక్కాల నాగ బుజ్జి ,కొత్తపల్లి గోపి, చిట్రోజు కృష్ణ, ఎస్.వి. లక్ష్మయ్య, శివ, కొండబాబు, వెంకటరత్నం, నరేష్, కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, వానపల్లి పుండరీకాక్షుడు, మేకా ఆదినారాయణ, సమాచార శాఖ రిటైర్డ్ ఉద్యోగి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత అంబటి ఆంజనేయులు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఘనంగా నివాళులు అర్పించారు. అంబటి ఆంజనేయులు జోహార్ ,అంబటి అమర్ రహే, అంబటి ఆశయాలు సాధిస్తాం అంటూ పాత్రికేయులు నినాదాలు చేశారు.

## ఘనంగా తొలి ఏకాదశి పూజలు



రామ కిష్టయ్య సంగన భట్ల

ధర్మపురి జూన్ 29 (ప్రజామంటలు): ధర్మపురి క్షేత్రస్థ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానంలో అన్ని దేవాలయాలలో, గురు వారం ఆషాఢ శుద్ధ ఏకాదశి పర్వదినం యుత అభిషేకం, అవధారయ పూజలు, హారతి మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఈఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో, సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పర్యవేక్షణలో, పునరుద్ధరణ కమిటీ పర్యవేక్షణలో, ఆస్థాన వేద వేదపండితులు రమేశ్ శర్మ, ముత్యాల శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచార్య, నేరెళ్ళ శ్రీనివాసాచార్య, రమణాచార్య, నరసింహమూర్తి, వంశీ కృష్ణ, అరుణ్, వామన్, అర్చకులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరిలో మంగళ స్నానాలు ఆచరించిన భక్తులు, స్థానికులు, దైవ దర్శనాలు చేసుకున్నారు.

### ఘనంగా బక్రీద్ వేడుకలు:

ప్రాచీన సనాతన సాంప్రదాయాలకు నిలయమైన, ధర్మపురి క్షేత్రంలో గురు వారం ఈద్ ఉల్ జుహా (బక్రీద్) వేడుకలు ఘనంగా, వైభవోపేతంగా జరిగాయి. పవిత్ర బక్రీద్ పండగ సందర్భంగా, ముస్లిం సోదరులు ప్రాచీన సాంప్రదాయ రీతిలో వేడుకలను జరుపుకున్నారు. ధర్మపురి క్షేత్రంలోని ఈద్ గాహ్, ఇబ్రహీం మసీదు వద్ద వేరువేరుగా వందలాది సంఖ్యలో సామూహిక ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మస్జీద్ లలో ఈద్గాలో ముఫ్తి జుబేర్, హాఫీజ్ అహ్మద్, అజీముల్ల బేగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. దోరకాల్ ఈదుజ్డ్ చాట్ చే తక్బీర్ సహిత ప్రార్థనలు భక్తి శ్రద్ధలతో గావించారు. ఒక మార్గం గుండా వెళ్ళి మరోమార్గం గుండా తక్బీర్ అలా ఉచ్చరిస్తూ, సంప్రదాయాచరణ గావించారు. మత పెద్దలు ఇమాం త్యాగానికి ప్రతిరూపమైన బక్రీద్ సంబంధిత ప్రాచీన గారు వివరించారు. హజ్రత్ ఇబ్రహీం జ్ఞాపకార్థం ఖుర్బానీ ఇచ్చే ఆధారాన్ని పాటించారు. ఖుర్బానీని మూడు భాగాలుగా చేసి ఇంటి వారు, బంధువులు ఆరగించడంతో పాటు పేదలకు పంచి పెట్టారు. మహమ్మదీయులకు పవిత్ర దినమైన బక్రీద్ పండగ నాడు ముస్లిం సోదరులంతా ఆనందోత్సాహాల మధ్య పరస్పర శుభాకాంక్షలను తెలుపుకున్నారు. అలాగే ముస్లిం మహిళలు ఆచారం ప్రకారం ఇతరుల ఇళ్ళకు వెళ్ళి, తోటి మహిళలకు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా ధర్మపురి సి. ఐ రమణ మూర్తి, ఎస్.ఐ. దత్తాత్రి అధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈద్ గాహ్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు గావించారు. నూతన వస్త్రాలు, సుగంధ ద్రవ్య అలంకృతులై, రుచికరమైన ప్రత్యేక వంటకాలు తయారు చేసి మిత్రులను, బంధువులు, ఇండ్లకు ఆహ్వానించి విందులారగింప చేశారు. ఆనందోత్సాహాల మధ్య హిందూ, ముస్లిం సోదరులంతా పరస్పరం పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## గ్రూప్ -4 పరీక్షకు అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలి

### జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

### జూలై-1న ఉదయం 8 గంటల నుండి 9-45 వరకు

### మధ్యాహ్నం 1 గంట నుంచి 2-15 గంటల వరకు పరీక్షా సెంటర్ లోనికి అనుమతి

### పరీక్ష సమయానికి 15 నిమిషాల ముందే మేయిన్ గేట్ మూసివేత



జగిత్యాల జూన్ 29 (ప్రజామంటలు): జూలై -1న ఉదయం 10 గంటల నుండి 12–30 గంటల వరకు, మధ్యాహ్నం 2–30 నుంచి 5 గంటల వరకు నిర్వహించు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ -4 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సకాలంలో, ముందస్తుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:00 గంటల నుండి 9–45 వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి 2–15 గంటల వరకు పరీక్షా సెంటర్ లోనికి అభ్యర్థులను అనుమతించడం జరుగుతుందని, పరీక్ష సమయానికి 15 నిమిషాల ముందే మెయిన్ గేట్ మూసివేయడం జరుగుతుందని, సమయం దాటిన తర్వాత ఎట్టి పరిస్థితిలో అనుమతి ఉండదని, అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి పరీక్షా సమయానికి ముందస్తుగా వచ్చి ప్రశాంతంగా పరీక్ష రాయాలని, అభ్యర్థులు తమ వెంట ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్ వంటివి, అనుమతి లేనివి తీసుకొని రావద్దని, అభ్యర్థులు చెప్పులు మాత్రమే వేసుకరావాలని, మహిళలు విలువైన ఆభరణాలు ధరించి పరీక్ష హాలుకు రావద్దని సూచించారు. ఒరిజినల్ హాల్ టికెట్ తో పాటు ఒరిజినల్ వ్యాలిడిటి ఫోటో ఐ.డి. గుర్తింపు కార్డ్ తీసుకొని రావాలని సూచించారు. జిల్లాలో 73 పరీక్షా కేంద్రాలలో 21,937 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి వెళ్ళే సమయంలో క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపనున్నందున అభ్యర్థులు ఆభరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ ఫోన్ లు వెంట తీసుకొని రావద్దని అభ్యర్థులకు తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్ పై ఫోటో, సంతకం పరిశీలన చేసుకోవాలని, హాల్ టికెట్ పై ఫోటో సరిగ్గా లేని పక్షంలో గెజిటెడ్ అధికారి చే ధృవీకరించిన 3 పాస్ పోర్ట్ సైజ్ ఫోటో లు తీసుకొని రావాలని, లేనిపక్షంలో పరీక్ష రాయడానికి అనుమతించ బోరని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు ఓ.ఎం.ఆర్. షిట్ పై సూచనలు చదవాలని, హాల్ టికెట్ నెంబర్, ప్రశ్నా పత్రం నెంబర్ సరిగ్గా నమోదు చేయాలని, ప్రశ్న పత్రంలో ఏమైనా ప్రింటింగ్ సరిగా లేకపోతే వెంటనే ఇన్విజిలేటర్ కు సమాచారం అందించాలని కలెక్టర్ తెలిపారు. పరీక్షా హల్ లో ప్రతి అరగంటకు ఒకసారి బెల్ మోగించడం జరుగుతుందని, చివరి 5 నిమిషాలను సూచిస్తూ హెచ్చరిక బెల్ మోగుతుందని, దీనికి అనుగుణంగా అభ్యర్థులు పరీక్ష రాయాలని కలెక్టర్ తెలిపారు. ఓఎంఆర్ షిట్ పై వైటనర్, ఎరైజర్, వివిధ రకాల ట్యాంపరింగ్ పాల్పడితే ఆ ఓఎంఆర్ షిట్ చెల్లదని, పరిక్షా కేంద్రాల్లో ఇతరులతో మాట్లాడటం, పరీక్ష ముగిసిన తరువాత అభ్యర్థులు తమ ఓఎంఆర్ షీట్ ను ఇన్విజిలేటర్ అప్పజెప్పిన తర్వాత ఎడమచేతి బొటనవేలి ముద్ర ఇవ్వాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## శ్రీ మేధా యూరాలజీ కిడ్నీ సెంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



జగిత్యాల జూన్ 29 (ప్రజామంటలు): జిల్లా కేంద్రంలో గురువారం శ్రీ మేధా యూరాలజీ కిడ్నీ సెంటర్ ను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం కిడ్నీ సెంటర్ వైద్య దంపతులు ఎం. దత్తు ప్రసాద్ మౌనికలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్, డాక్టర్ తాటిపాముల సురేష్, డాక్టర్ భీమనాథి శంకర్ జిల్లా వైద్యాధికారి పుప్పాల శ్రీధర్, వార్డ్ కౌన్సిలర్ అవారి శివ కేసరి బాబు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేయగా విచ్చేసిన అతిధులకు కిడ్నీ సెంటర్ వైద్య దంపతులు ఎం. దత్తు ప్రసాద్, మౌనిక శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా వేద బ్రాహ్మణోత్తములు ఆశీర్వచనం చేశారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆసుపత్రిని సందర్శించి కిడ్నీ సెంటర్ వైద్య దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ధర్మపురిలో కెమెరా దినోత్సవ వేడుకలు అమ్మవారి రూపంలో ప్రత్యేక పూజలు

రామ కిష్టయ్య సంగన భట్ల



ధర్మపురి జూన్ 29 (ప్రజామంటలు): ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి క్షేత్రం లో జాతీయ కెమెరా దినోత్సవ వేడుకలకు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫెర్స్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటో గ్రాఫర్ల సంక్షేమార్థం కెమేరాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఛాయాచిత్ర యంత్ర దేవత పూజలో భాగంగా కెమేరాకు పంచామృతాలతో అభిషేకం, అనంతరం కెమెరాను అమ్మ వారిగా అలంకరించి సాధారణ పూజలతో పాటు కెమెరా పరిభాషలో అంగ పూజ, అర్చన, ధూప, దీప, నైవేద్యం, మంగళ హారతి, హెూమం, పూర్ణాహుతి, తీర్థ ప్రసాదాలు వితరణ ఇత్యాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ చాయాచిత్ర యంత్ర దేవత పూజా విధానము ప్రత్యేకతను సంతరించుకున్నది. కెమెరా దేవత ప్రత్యేక పూజా విధానంను ఆచరించి తెలంగాణ రాష్ట్రంలో, దేశంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు జగిత్యాల జిల్లా ధర్మపురి ఫోటోగ్రాఫర్లు. అధ్యక్షుడు కొత్తపెల్లి కిషన్, ప్రధాన కార్యదర్శి వడ్లూరు రవీందర్, ఉపాధ్యక్షుడు గంధం ధర్మయ్య, క్యాషియర్ భూపతి మల్లేశం, గౌరవాధ్యక్షుడు ఉయ్యాల శ్రీనివాస్, ముఖ్య సలహాదారు ఉత్తెం పెద్దన్న, జగిత్యాల జిల్లా సంఘం సభ్యులు వంగల రవీందర్, ధర్మపురి మండల సంఘం కార్యవర్గ సభ్యులు గంధం లక్ష్మణ్, గంధం తిరుపతి, అన్నవేని మహేష్ తదితరులు పాల్గొన్నారు.



జనగామ జిల్లాలోని నెహ్రూ పార్క్ వద్ద ఉన్న గణేష్ దేవాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా వినాయకుడికి జలాభిషేకం, పాలాభిషేకం, దీపం నైవేద్యం సమర్పించి అందరూ చల్లగా ఉండాలని భక్తుడు విగ్నేష్ పటేల్ ప్రత్యేక పూజలు.

## శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో గోపూజ



కొడిమ్యాల జూన్ 29 (ప్రజామంటలు): కొడిమ్యాల మండల కేంద్రములోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకం, భక్తులచే గోపూజ నిర్వహించడం జరిగింది. ఈ రోజున మహా విష్ణువు యోగ నిద్రలోకి వెళ్తాడు కావున ఈ ఏకాదశిని శయనైకాదశీ అని తొలి ఏకాదశి అని పిలుస్తారు. ఇట్టి పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు నాగరాజు రమేష్ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో భక్తులు ప్రజలు నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ ప్రజల దశాబ్ది కల నెరవేరింది

### గౌరవెల్లి రిజర్వాయర్ ట్రయల్ రన్

### పాల్గొన్న వొడితల సతీష్ కుమార్

హుస్నాబాద్ జూన్ 29 (ప్రజామంటలు): గౌరవెల్లి ప్రాజెక్టు లోనికి నీటిని విడుదల చేసి ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ మాట్లాడుతూ..... ప్రతిపక్షాలు అర్థం లేని మాట్లాడుతున్నారని తెలంగాణ రాకముందు హుస్నాబాద్ నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని, 2009 నుండి 2014 వరకు కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని అప్పుడు ఎంపీ మరియు ఎమ్మెల్యేగా ఉన్న నాయకులు గౌరవెల్లి ప్రాజెక్టు నుండి తట్టెడు మట్టిని కూడా తీయలేదని కానీ ఇప్పుడు ప్రాజెక్టు పూర్తి చేసి నీటిని విడుదల చేశామని, ఆనాడు సీఎం కేసీఆర్ గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి గోదావరి జలాలతో హుస్నాబాద్ భూములను తడిపి, ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తానని ఇచ్చిన వాగ్దానం నెరవేర్చామన్నారు. కాంగ్రెస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి, అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యే దగ్గర సంబంధాలు కలిగి ఉన్నారని కానీ ఆయన అప్పటి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి నియోజకవర్గానికి ఎన్ని నిధులు తీసుకువచ్చారు? ఎంత అభివృద్ధి చేశారో చెప్పాలని అన్నారు. ఈరోజు హుస్నాబాద్ నియోజకవర్గంలో ఆర్డీవో ఆఫీస్, ఏసీపీ ఆఫీస్, 16 సబ్ స్టేషన్లు, ఆర్ అండ్ బి, నేషనల్ హైవే ఆఫీసులు, వివిధ విభాగాల ఆఫీసులు, పాలిటెక్నిక్ కాలేజ్, మోడల్ స్కూల్, బీసీ, ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూల్స్, డిగ్రీ కాలేజ్, టీచర్ ట్రైనింగ్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ ఆఫీస్, అలాగే నియోజకవర్గంలో ప్రతి గ్రామ, గ్రామానికి లింకు రోడ్లు, గ్రామాలలో సిసి రోడ్లు, డ్రైనేజీ సిస్టం, ఇంటింటికి మిషన్ భగీరథ నీళ్లు, వివిధ సామాజిక భవనాలు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల మరమ్మత్తులు, తండాలను గ్రామ పంచాయతీలుగా చేసుకున్నామని, నియోజకవర్గంలో ప్రతి ఇంటికి తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాయని ఇది నిరంతరం ఇలాగే కొనసాగుతుందని అన్నారు. హుస్నాబాద్ పట్టణాన్ని గ్రామపంచాయతీ నుండి, నగరపాలక సంస్థ, మున్సిపాలిటీగా చేసుకున్నామని, ఒక 10 సంవత్సరాలు ముందు ఏ విధంగా ఉంటుందో ఇప్పుడే ఆ విధంగా హుస్నాబాద్ పట్టణాన్ని అభివృద్ధి చేసుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జెడ్ పి ఛైర్మెన్ సుధీర్ బాబు సిద్దిపేట జెడ్ పి వైస్ ఛైర్మెన్ రాయి రెడ్డి రాజిరెడ్డి, అక్కనపెట్ జెడ్ పి టి సి భూక్యా మంగా, అక్కనపెట్ ఎంపిపి గుగూలోతు లక్ష్మి, భీమదేవరపల్లి ఎంపీపీ అనిత, కోహెడ ఎంపిపి కోక్కుల కీర్తి, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## భక్త బృందముచే భజన కార్యక్రమం



జగిత్యాల జూన్ 29 (ప్రజామంటలు): జగిత్యాల పట్టణంలోని బ్రాహ్మణ వీధి హరిహరాలయంలో హనుమాన్ చాలీసా భక్త బృందం వారిచే తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని విష్ణు సహస్రనామ పారాయణము, భజన కార్యక్రమాన్ని కొనసాగించారు. విశేష సంఖ్యలో భక్త బృందం పాల్గొని భజనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భజనలతో ఆలయమంతా మారుమ్రోగింది. సంగనభట్ల నరేంద్ర శర్మ మరియు హనుమాన్ చాలీసా భక్త బృందం పాల్గొన్నారు.



మెట్ పల్లి డిపో మేనేజర్ వేదవతి నుండి మెట్ పల్లి డిపో లో కండక్టర్ గా విధులు నిర్వహిస్తూ బెస్ట్ ఈపి కే అవార్డు అందుకున్న వనమాల మురళీధర్.


## సాయిబాబా ఆలయంలో సాయి సప్తాహ ఉత్సవాలు

### వారం రోజుల పాటు వేడుకలు



సికింద్రాబాద్ జూన్ 29 (ప్రజామంటలు): పద్మారావునగర్ లోని శ్రీసాయిబాబా ఆలయంలో గురువారం శ్రీసాయి సప్తాహ ఉత్సవాలల్లో భాగంగా గురుపౌర్ణమిని పురస్కరించుకొని తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీసాయి స్వర్ణాభిషేకం నిర్వహించగా , వందలాది మంది భక్తులు హజరై, బాబాను దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని రావి, వేప వృక్షాలకు లక్ష్మీనారాయణ కళ్యాణం నిర్వహించారు. శ్రీసాయి విభూతి సేవ, శ్రీసాయి విష్ణుసహాస్రనామ సేవ నిర్వహించారు. ఆశ్రమ ఉత్తరాధికారి కీర్తిమా ఈసందర్భంగా భక్తులకు శ్రీసాయి సచ్చరిత్ర,లీలలను, భజనలను ఆలపించారు. సర్వదోష నివారణ, ప్రకృతి శాంతికై పంచభూత హారతిని ఇచ్చారు. శుక్రవారం శ్రీసాయి అష్టలక్ష్మీ సేవ నిర్వహించనున్నట్లు కార్యదర్శి బి. చల్వరాయ్ తెలిపారు.

## భక్తి ప్రవత్తులతో తొలి ఏకాదశి వేడుకలు



సికింద్రాబాద్ జూన్ 29 (ప్రజామంటలు): తొలి ఏకాదశి పండుగను ప్రజలు గురువారం భక్తి ప్రవత్తులతో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే ఆయా ఆలయాలకు వెళ్ళిన భక్తులు ఈసందర్భంగా పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీతో స్కందగిరి శ్రీసుబ్రహ్మణ్యస్వామి , శ్రీవెంకటేశ్వరస్వామి, శ్రీ సాయిబాబా ఆలయాలు కిక్కిరిసిపోయాయి. బీఆర్ఎస్ పద్మారావునగర్ ఇంచార్జీ గుర్రం పవన్ కుమార్ గౌడ్ సతీ సమేతంగా సాయిబాబా ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పవన్ కుమార్ గౌడ్ దంపతులను సత్కరించి, బాబా వారి పరిమళ ప్రసాదాలను అందచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముక్క శ్రీను, హరిచారి పాల్గొన్నారు. అలాగే ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రత్యేక ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# గీత వృత్తిని ప్రమాద రహిత వృత్తిగా చేయడమే లక్ష్యం

జనగామ జూన్ 29 (ప్రజామంటలు): గీత వృత్తిని ప్రమాద రహిత వృత్తిగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తారని గీతా పారిశ్రామిక సహకార సంస్థ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ అన్నారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర సదస్సుకు ముఖ్య అతిథులుగా విశిష్ట అతిథులుగా పల్లె రవికుమార్ గౌడ్, ముఖ్య అతిథులుగా మేకపోతుల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ గౌడ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో రెండు లక్షల 60 మంది గీతా కార్మికులు గీతావృత్తిని కొనసాగిస్తున్నారని, దాదాపు 5 లక్షల మంది గీత వృత్తిపై ఆధారంగా చేసుకుని బతుకుతున్నారని అన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం మూలంగా వృత్తిపట్ల కుట్ర పూరితంగా వ్యవహరించారని, వృత్తిలో ఆధునికరణ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తిలో వైఫల్యాలు అరికట్టి చావులను ఆపడమే లక్ష్యంగా పని చేద్దామని సూచించారు. వృత్తి నిర్లక్ష్యం చేయకుండా తాటి ఈత వాహనాలను కాపాడుకుందాం అని వాటి పెంపుకు చేద్దామని ఆయన కోరారు. అనంతరం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు నేటికి కల్లు గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, కుటుంబ పోషణ కొరకు ప్రమాదకరమైన వృత్తి అయినప్పటికీ చేస్తున్నారని అన్నారు. ప్రతి సంవత్సరం రాష్ట్రంలో 600 మంది పైగా ప్రమాదానికి గురవుతున్నారని, కాళ్లు, చేతులు విరగడం, నడుములు పడిపోవడం జరుగుతుందని, నూటయాభై కి పైగా చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత ప్రమాదాలు ఏ వృత్తిలో లేవని అన్నారు. 2021 డిసెంబర్ 10వ తేదీన హైదరాబాద్ సుందరయ్య కళా నిలయంలో కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర సెమినార్ లో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం పాల్గొన్నప్పుడు ప్రభుత్వ ఇస్తున్న ఎక్స్రేషియో ఆలస్యం అవుతుందని ఈ విషయం అయన దృష్టికి తీసుకుపోగా, ప్రభుత్వమే కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సాయం చేయాలని కోరామని తెలిపారు. ప్రమాదాలు నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని నీరా తాటి, ఈత ఉత్పత్తులు పరిశ్రమ నెలకొల్పాలని యువతి, యువకులకు ఆర్థిక సహకారం అందించాలని, సభ్యులందరికీ ద్విచక్ర వాహనాలివ్వాలని, కోటి వరాల పథకంలో 439 సొసైటీలకు ఇచ్చిన భూములు అన్ని ఆన్యాక్రాంతం కాకుండా చూసి, వాటిలో చెట్లు నాటే కార్యక్రమం చేపట్టాలని కోరారు. చెట్ల పెంపకానికి 5 ఎకరాల భూమి ఇవ్వాలని, 560 జీవో అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో తోటి గీతా కార్మికుని ప్రాణాలు కాపాడిన బింగి పాండు ను అభినందించి, సత్కరించారు. అనంతరం బాధితులకు కార్పొరేషన్ ద్వారా మంజూరైన చెక్కులను రవికుమార్ గౌడ్ అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు



తెలంగాణ కల్లగీతా కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ కార్యదర్శులు చౌగాని సీతారాములు, ఎస్ రమేష్, బూడిద గోపి, అరుణ్, అంజయ్య ఉపాధ్యక్షులు గోవిందు, వెంకట నరసయ్య, గౌని వెంకన్న, వెంకట మల్లయ్య, బలగాని జయరాములు, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు మండల అధ్యక్ష, కార్యదర్శులు గీత కార్మికులు పాల్గొన్నారు.

## బీసీ విద్యార్థి సంఘాలచే జులై 1న రాష్ట్ర వ్యాప్త కలెక్టరేట్ల ముట్టడి

జగిత్యాల జూన్ 29 (ప్రజామంటలు): తెలంగాణలోని లక్షల మంది బిసి, ఎస్సి, ఎస్టి, మైనారిటీ విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపకార వేతనాలు పెంచాలనే డిమాండ్లతో జులై 1వ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్ పిలుపునిచ్చారని. ఆ పిలుపునందుకొని జులై 1 శనివారం విద్యార్థులతో కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, ముందుగా విద్యార్థులచే తరగతుల బహిష్కరణ నిర్వహించి తదుపరి కలెక్టరేట్ ముట్టడించేందుకు పిలుపునిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. తెలంగాణ లోని అన్ని మండల కేంద్రాల్లో ఎమ్మార్వో కార్యాలయాలు, డివిజన్ కేంద్రాల్లో ఆర్డీవో కార్యాలయాలు ముట్టడించేందుకు విద్యార్థులు సన్నదం అవ్వాలని ఆయన కోరారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల గంగాధర్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రియంబర్స్ మెంట్ విడుదలలో జాప్యం చేస్తూ ఇటు ప్రభుత్వం అటు కళాశాల యాజమాన్యం విద్యార్థులను మానసిక ఒత్తిడి గురిచేస్తూ వారి జీవితాలతో ఆటలాడుతూ కాలయాపన చేస్తుందని వెంటనే బకాయి ఉన్న 5 వేల కోట్లు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మినారాయణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల గంగాధర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యనిర్వాహక కార్యదర్శి అలిశెట్టి ఈశ్వరయ్య, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కొక్కు గంగాధర్, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు తిరుపురం రాంచందర్, గోవర్ధన్, నాగరాజు పాల్గొన్నారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని కాళేశ్వరం గ్రామంలో తొలి ఏకాదశి సందర్భంగా కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీధర్ బాబు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసిన ఆలయ అర్చకులు.



మహాదేవపూర్ మండల కేంద్రంలోని జామా మజీద్ లో బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే శ్రీధర్ బాబు అనంతరం ఇటీవల యాక్సిడెంట్ లో చనిపోయిన షాబీర్ కుటుంబాన్ని పరమర్శించారు.

## అలయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక





కోరుట్ల టౌన్ జూన్ 29 (ప్రజామంటలు): సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలను అందిస్తూ, స్వచందంగా సేవలు చేస్తున్న కోరుట్ల అలయన్స్ క్లబ్ 2023-24 సంవత్సరానికి గాను ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో అధ్యక్షునిగా పాటిల్ ధరందీప్, ప్రధాన కార్యదర్శిగా గోనె శ్రీహరి, కోశాధికారిగా కటుకం మల్లిఖార్జున్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా గవర్నర్ వేణు కుమార్ తెలిపారు. ఈ సందర్బంగా ఇంటర్ నేషనల్ అడ్వైజర్ కటుకం రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.... పట్టణంలో అలయన్స్ క్లబ్ ప్రారంభించిన నాటి నుండి అనేక సేవా కార్యక్రమాలలో ముందున్నామని ప్రజలకు ఉపయోగపడే విధంగా బాడీ ఫ్రీజర్, వైకుంఠ రథం, స్వర్గ రథం లాంటి శాశ్వత ప్రాజెక్టు లతో సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా గవర్నర్లు కటుకం సురేందర్, కైలాస నాగేశ్వర్ రావు, చింతకింది ప్రదీప్, కటుకం రాజశేఖర్ సభ్యులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లో ఉత్సాహం

### పాతవారిని తిరిగి రప్పించే యత్నాలు

### పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టామన్న షబ్బీర్

నిజామాబాద్,జూన్29 : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి నేతలకు అవకాశం దొరికింది. పిసిసిచీఫ్‌గా రేవంత్‌రెడ్డి నియామకం తరవాత ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ కార్యకలాపాలు పెరిగాయి. ఇప్పుడు కార్యకర్తలు కూడా ధైర్యంగా కార్యక్రమాలను ముందుకు తీసుకుని వెళుతున్నారు. జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీమంత్రి షబ్బీర్ అలీ



ఇప్పటికే పలు కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారు. జిల్లాలో పార్టీ విస్తరణకు గల అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. ప్రధానంగా జిల్లాలో పసుపు, ధాన్యం, ఎర్రజొన్న రైతుల సమస్యలపై పోరాడడం ద్వారా రైతుల్లో కొంత సానుభూతిని సాధించారు. ఈ విషయాల్లో అధికార బిఆర్ఎస్, బిజెపిలు విఫలం అయ్యాయని షబ్బీర్ అలీ ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు ఒకే దఫాలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ అనుసంధానం, పంట బీమా, వరికి క్వింటాల్‌కు రూ.2500 చెల్లిస్తామ న్నారు. రేవంత్ రెడ్డి కూడా ఇప్పటికే పసుపు రైతుల పోరాటానికి మద్దతుగా నిలిచి ఇక్కడి కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపారు. ఇంతకాలం స్తబ్దుగా ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలకు నయాజోష్ వచ్చిందని షబ్బీర్ అలీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గతంలో ఆర్మూర్ లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజీవ్ రైతు భరోసా దీక్ష విజయవంతమైంది. ప్రస్తుతం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ పూర్తి అండగా నిలవడంతో ఆశావహులు కాంగ్రెస్ పార్టీలో చేరే విషయమై సన్నిహితులతో చర్చలు జరుపుతున్నారు. దీనికితోడు ప్రచార కమిటీ చైర్మన్‌గా మాజీ ఎంపీ మధుయా ష్కీ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహేష్ గౌడ్ ఉండడం అదనపు బలంగా మారింది. జిల్లా రాజకీయాల్లో వీరు కూడా తమవంతుగా ఉత్సాహం నింపుతు న్నారు. మధుయాష్కీ నిజామాబాద్ పార్లమెంట్ నుంచి రెండు పర్యాయాలు ప్రాతినిథ్యం వహించారు. ఆయనకు అధినాయకులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అలాగే, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్‌తో నాయకులకు, కార్యకర్తలకు చనువు వుంది. ఎన్ఎస్‌యూఐ నాయకుడిగా ఉన్నప్పటి నుంచి అందరితో సంబంధాలు ఉన్నాయి. మొత్తంగా పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భావిస్తున్నారు. రేవంత్‌రెడ్డిని అధ్యక్షుడిగా నియమించడంతో పార్టీలో క్రియాశీలకంగా ఉండాలని చాలామంది ముందుకు వస్తున్నారని అన్నారు. మరోవైపు రేవంత్‌కు మద్దతుగా కొంత మంది నాయకులు బహిరంగంగానే ప్రకటనలు చేశారు. రేవంత్‌రెడ్డి రావడంతో పార్టీకి పూర్వవైభవం వస్తుందని పార్టీ నాయకులు కూడా భావిస్తున్నారు. గత మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ప్రభావం ఏ మాత్రం కనిపించలేదు. అనేక చోట్ల పోటీ చేయడానికి అభ్యర్థులు కూడా దొరకలేదు. కాంగ్రెస్‌కు నాయకత్వ కొరత ఉండడంతో అనేక మంది బీజేపీ వైపు మొగ్గు చూపారు. ఆ పార్టీ టికెట్ కోసం పోటీ పడ్డారు. స్థానికంగా కాంగ్రెస్ నాయకులను పట్టించుకు నేవారు లేకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యారు. ఈ సమస్యలు ఇక ఉండవని షబ్బీర్ అభిప్రాయ పడ్డారు. ఇటీవలి కర్నాటక ఎన్నికలు, రాహుల్ సందేశం తరవాత మెల్లగా పాతవారందరూ మళ్లీ కాంగ్రెస్ పార్టీ గూటికి వస్తారని పార్టీ నాయకులు కూడా భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి వెళ్లిన వారికి అధికార పార్టీలో అంత ప్రాధాన్యం లేకుండా పోయింది. వారంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దీంతో వారు తిరిగి వెనక్కి వస్తారని భావిస్తున్నారు.

## సాయిచంద్ మృతి తీరని లోటు ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



జగిత్యాల జూన్ 29 (ప్రజామంటలు): తన పాట మాటలతో తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర వహించి గాయకునిగా అందరి మన్ననలు పొంది, ఉద్యమంలో పాటలతో ఉత్సహపరిచి ప్రజలను ఆలోచింపజేసిన మిత్రుడు సాయి చంద్ అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. వారికి ఘన నివాళి అర్పస్తూ, వారి ఆత్మ కు స్వర్గ ప్రాప్తి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.



శ్రీ మహా విష్ణువు యోగనిద్రకు ఉపక్రమించిన వేళ జరుపుకునే తొలి ఏకాదశిపర్వదినంసందర్భంగాజగిత్యాల పట్టణంలోని మడేలేశ్వర స్వామి వారిని దర్శించుకుని, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. బిఆర్ఎస్ కౌన్సిలర్ లు, నాయకులున్నారు.

## ఎన్నికల్లో గెలుపు కోసం అధికార పార్టీల వ్యూహం

### జగనన్న పథకాలతో దూకుడు పెంచిన జగన్

### తెలంగాణలో బిఆర్ఎస్ ఒంటరి పోరాటం

### అన్ని వర్గాలకు పథకాలు రచిస్తున్న కెసిఆర్

### ఇప్పటికీ ఎటూ తేలని చిన్న పార్టీల వైఖరి

హైదరాబాద్/అమరావతి,జూన్29 : తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు ఎన్నికల సందడే కనిపిస్తోంది. రాజకీయంగా హడావిడి మొదలయ్యింది. మరోమారు అధికారంకోసం అధికారంలో ఉన్న కెసిఆర్, జగన్‌లు పావులు కదుపుతున్నారు. ప్రజలను బురిడీ కొట్టించే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. పేదలకు వరాలు ప్రకటిస్తున్నారు. ఈ క్రమంలో ఎవరు ఎవరితో ఉంటారన్నది ఎన్నికలు దగ్గర పడే వేళ..రాజకీయ ముఖచిత్రం.. స్పష్టం అవుతోంది. ఎపిలో వైసిపి ఒంటరి పోరుకు దిగడం దాదాపు ఖాయం కానున్నది. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలిస పోటీచేయడం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. బిజెపి కలవాల్సి వస్తే లెఫ్ట్, ముస్లిం మైనార్టీలు మద్దతు ఇవ్వక పోవచ్చు..కనుక ఇప్పుడా జోలికి వెళ్లడం లేదు. సిఎం జగన్ మా÷-తరం సవాళ్లు విసరుతూ, ఆరోపణలు గుప్పిస్తే..పథకాల పేరుతో బటన్ నొక్కుతూ..ఓటు బ్యాంకును పదిలం చేసుకుంటున్నారు. ఇవే తనకు రక్ష అని నమ్ముతున్నారు. జగనన్న పేరుతో అనేక పథకాలు అమలవుతున్నాయి. అవన్నీకూడా డబ్బులను నేరుగా కాతాల్లో వేసేవే. తెలంగాణలో బిఆర్ఎస్ కూడా ఒంటరి పోరు చేయనుంద. కాంగ్రెస్ ప్రధాన పోటీదారుగా ఉండనుంది. బిజెపి కూడా పోటీకి సై అంటోంది. ఎవరు ఎవరికి దగ్గరగా జరుగుతున్నారో .. తెలుస్తూనే ఉంది. ఈ క్రమంలో తెలంగాణలో ఎవరు ఎవరి వైపు ఉన్నారో చెప్పడం కష్టం..త్వరలోనే మరింత స్పష్టత రానుంది. ఇక ప్రతిపక్షం కాంగ్రెస్ భాజపా-భారస ఒకటేనని ఆరో పిస్తోంది. కేసీఆర్ దేశ్ కీ నేతా గా ప్రొజెక్ట్ చేసుకోవడం.. భారసా ఆవిర్భావం... ఇవన్నీ మోదీని ఢీకొట్టడానికే అన్నట్లుగా జరిగాయి. బీజేపీ ఈడీని దింపితే.. ఈయన సీఐడీని దింపారు. పరస్పర కేసులతో ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో కవిత అరెస్ట్ అయ్యేవరకూ పరిస్థితి వెళ్లిపోయింది. ఆ తర్వాత కేసీఆర్ సడన్ గా సైలంట్ అయ్యారు. కవితను కాపాడుకోవడానికే తగ్గారన్న అన్న అనుమానాలు వచ్చాయి. జాతీయ పార్టీగా కేవలం మహారాష్ట్రలో మాత్రమే కేసీఆర్ ప్రచారం ప్రారంభించారు. మహరాష్ట్రకు రావడంపై శివసేన తమ అధికారిక పత్రిక సామ్నాలో వ్యాఖ్యలు చేసింది. బీఆర్ఎస్‌ను బిజెపికి బీ టీమ్‌గా పార్టీతో పోల్చింది. బీజేపీయేత పార్టీల ఓట్లను చీల్చడానికి బీజేపీ ఎంఐఎంను వాడుకునేదని.. ఆ పార్టీ సంగతి అన్ని రాష్ట్రాల్లో తెలిసి పోవడంతో ఇప్పుడు కొత్తగా కేసీఆర్‌ను తీసుకొచ్చారని సామ్నాలో రాసుకొచ్చారు. అంతే కాదు. శివసేన నేత సంజయ్ రౌత్ కేసీఆర్‌ను బీజేపీకి బి టీమ్ అని ఆరోపించారు. ఎన్సీపీ అధినేత శరద్ పవార్ కూడా అదే మాట అన్నారు. న్నికలకు ముందు ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు కోసం కేసీఆర్ అందరు నేతలను కలిశారు. కానీ కొన్ని రోజుల కిందట పట్నాలో ప్రతిపక్ష పార్టీల సమావేశం జరిగితే కేసీఆర్‌కు ఆహ్వానం లేదు. పొరుగున ఉన్న కర్ణాటకలో భాజపాయేతర ప్రభుత్వం ఏర్పాటయ్యి.. ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య ప్రమాణం చేస్తే.. అన్ని చాలా రాజకీయపక్షాలు హాజరయ్యాయి కానీ కేసీఆర్‌ను పిలవలేదు. ఎన్నికలకు ముందు జేడీఎస్ నేత కుమారస్వామి కేసీఆర్‌తో కలిసినా.. కర్ణాటక ఎన్నికల సమయానికి దూరమయ్యారు. అరవింద్ కేజీవ్రాల్‌తో మంచి సంబంధాలే ఉన్నా.. ఢిల్లీ ప్రభుత్వ అధికారాలను కట్టడి చేయడం కోసం కేంద్రం తీసుకొచ్చిన ఆర్డినెన్సుకు వ్యతిరేకంగా కేసీఆర్ మాట్లాడలేదు. పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా బీజేపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై రాజకీయ పార్టీలన్నీ స్పందించినా.. కేసీఆర్ మాత్రం వ్యతిరేకించలేదు. ఇక ఈ మధ్య కాలంలో ఆయన బహిరంగ సభల్లో బీజేపీ కంటే.. కాంగ్రెస్‌ను ఎక్కువగా టార్గెట్ చేశారు. కేటీఆర్ వెళ్లిఇటీవల కేంద్ర మంత్రులను కలవడాన్ని రాజకీయ కోణంలో చూస్తున్నారు. ఈ కారణాల దృష్ట్యా బిఆర్ఎస్, బిజెపితో లోపాయకారి అవగాహనకు వచ్చిందని ఇతర పక్షాలు ఆరోపిస్తున్నాయి. దేశంలోని సమస్యలన్నింటికీ కాంగ్రెస్సే కారణం అని... అలాంటి కాంగ్రెస్ భాగస్వామ్యం వహించే.. నేతృత్వం వహించే ప్రతిపక్షాల కూటమిలో తామెందుకు ఉంటామని బీఆరెఎస్ నేతలు చెబుతున్నారు. కాంగ్రెస్- బీజేపీయేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నదే తమ లక్ష్యమని అందుకోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంటామని..



కేటీఆర్ ప్రకటించారు. ఇదిలా ఉంటే.. బీజేపీ ఇంకో రకంగా స్పందిస్తోంది. మోదీని గద్దె దింపాలన్నదే కేసీఆర్.. కాంగ్రెస్ లక్ష్యమని.. ఆ రకంగా ఆ రెండు పార్టీలు ఒకటేనని చెబుతోంది. కర్ణాటక ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేసి ఉంటే.. ఓట్లు చీలి బీజేపీకి లాభం చేకూరేదని.. అలా జరగకూడదనే పోటీకి దిగలేదని వారు ఆరోపిస్తున్నారు. కర్ణాటక ఎన్నికల్లో కేసీఆర్ కాంగ్రెస్‌కు ఆర్థిక సాయం కూడా చేశారని ఆరోపిస్తున్నారు. ఇదిలావుంటే కొత్తగా వచ్చిన బిఎస్పీ నేత ప్రవీణ్‌కుమార్, కొత్తగా పుట్టిన వైఎస్సార్ తెలంగాణ పార్టీలు ఎవరి టీమో అర్థం కాని పరిస్థితి ఉంది. షర్మిళను బీజేపీయే తీసుకొచ్చిందని చాలా ప్రచారం జరిగింది. ఇప్పుడేమో ఆమె కాంగ్రెస్‌తో కలిసి నడిచేందుకు రెడీ అవుతోందన్న వార్తలు వస్తున్నాయి. ఇక కాంగ్రెస్ తో హోరాహోరీకి కేసీఆర్ సిద్ధం అయ్యారని, బిజెపికి సీన్ లేదని ఆయన వ్యూహం చూస్తుంటేనే అర్థం అవుతోంది.

# ట్రిపుల్ ఆర్ టీమ్‌కు మరో గోల్డెన్ ఛాన్స్

### ఆస్కార్ కమిటీలో ఆరుగురు సభ్యులకు చోటు

### ఎన్టీఆర్, రామ్‌చరణ్, కీరవాణి, చంద్రబోస్‌లకు కమిటీలో స్థానం




దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కించిన 'ఆర్ఆర్ఆర్' చిత్రం ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిందో అంతకు మించిన సంచలనాలను ఇప్పుడు నమోదవుతున్నాయి. గతేడాది మార్చి 25న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం భాషతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా అదరగొట్టింది. ఆడియన్స్‌ను మెప్పించడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించింది. ఎన్నో అంతర్జాతీయ అవార్డులను కొల్లగొట్టింది. అంతేకాదు, భారతీయ సినిమా ఖ్యాతిని 'ఆర్ఆర్ఆర్' చిత్రం ఆస్కార్ వేదిక వరకూ తీసుకెళ్లింది. ఈ చిత్రంలోని 'నాటు నాటు' పాట ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డును గెలుచుకుంది. తాజాగా మరోసారి భారతీయ సినీ ప్రేక్షకులు గర్వించే క్షణం 'ఆర్ఆర్ఆర్'తో వరించింది. ఆస్కార్ గెలుచుకున్న ఈ చిత్ర యూనిట్‌కు ఇప్పుడు అకాడమీ జ్యూరీ మెంబర్స్ గా స్థానం దక్కింది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డులను ప్రదానం చేసే 'ద అకాడమీ ఆఫ్ మోషనల్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' కొత్తగా ఆస్కార్ కమిటీలో 398 మందికి సభ్యత్వం కల్పించింది. ఆ జాబితాను తాజాగా విడుదల చేసింది. ఇందులో 'ఆర్ఆర్ఆర్' టీంకు చెందిన ఆరుగురు ఉండటం విశేషం. స్టార్ నటులు జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్ తోపాటు సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, గేయ రచయిత చంద్రబోస్, ఛాయాగ్రాహకుడు సెంథిల్, ప్రొడక్షన్ డిజైనర్ సాబు సిరిల్ లకు ఈ కమిటీలో స్థానం దక్కింది. ఇక బాలీవుడ్ దర్శక నిర్మాత కరణ్ జోహార్ కు కూడా స్థానం లభించింది. ఆస్కార్ జ్యూరీ మెంబర్లుగా తారక్, చరణ్ లకు స్థానం లభించడంతో మెగా, నందమూరి అభిమానులు పండగ చేసుకుంటున్నారు. సోషల్ మీడియా ద్వారా నటులకు శుభాకాంక్షలు వెల్లువెత్రతాయి. ఇదే సమయంలో దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి పేరు లిస్టులో లేకపోవడంతో అభిమానులు నిరాశకు గురవుతున్నారు. ఎంతో కృషి చేసిన జక్కన్నకు ఈ గౌరవం దక్కి ఉంటే బాగుండేది అంటూ ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. కొత్తగా చేరిన మెంబర్స్‌తో కలిపి ప్రపంచ వ్యాప్తంగా అకాడమీ జ్యూరీ లిస్టులో 10,817 మంది ఉన్నారు. 96వ అకాడమీ అవార్డ్స్ లో మాత్రం 9,375 మంది మాత్రమే ఓటు వేయబోతున్నారని తెలుస్తోంది.




# బ్రో.. మూవీలో పవన్ లుక్స్ అదుర్స్ !

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఆయన మేనల్లుడు సాయి ధరమ్ తేజ్ మల్టీస్టారర్‌గా నటిస్తున్న కొత్త సినిమా బ్రో. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ మాటలు అందించారు. ఇప్పటికే ఈ సినిమాపై అభిమానుల్లో విపరీతమైన అంచనాలు ఉన్నాయి. రిలీజైన పోస్టర్స్ కూడా తెగ ఆకట్టుకుంటున్నాయి. మూవీ టీమ్ కూడా సినిమా రిలీజ్ డేట్ దగ్గర పడడం వల్ల గ్యాప్ లేకుండా వరుస సర్ప్రైజ్ లు ఇస్తోంది. మెగా హీరోల స్టైలిష్ పోస్టర్స్‌ను రిలీజ్ చేస్తూ అభిమానుల్లో జోష్ నింపుతోంది. ఈ క్రమంలోనే తాజాగా సినిమా టీజర్ రిలీజ్ ముహూర్తం కూడా ఖరారు చేసింది. ఇప్పటికే పవన్ - సాయి కలిసి ఉన్న మాస్ పోస్టర్ ను రిలీజ్ చేసింది. ఈ క్రమంలోనే సాయి తేజ్ కు సంబంధించి ఓ అల్ట్రా స్టైలిష్ పోస్టర్ ను రిలీజ్ చేసింది. ఇందులో సాయి బిస్కెట్ కలర్ సూట్ లో కంటికి కళ్ళజోడు భుజానికి బ్యాగ్ తగిలించుకొని స్టైలిష్ గా నడుస్తూ కనిపించారు. ఇప్పుడు పవన్ కళ్యాణ్ పోస్టర్ ను కూడా విడుదల చేసింది. ఇందులో పవన్ టాప్ టు బాటమ్ బ్లాక్ కలర్ డ్రెస్ లో తన మార్క్ లుక్ లో సూపర్ స్టైల్ గా కనిపించారు. మెడలో ఓ చైన్ కళ్ళకి కల్లోజోడు ధరించి అదిరిపోయారు. ఇది చూసిన అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. పోస్టర్ ను ఫుల్ ట్రెండ్ చేస్తూ పండగ చేసుకుంటున్నారు. టీజర్ కోసం వెయిటింగ్ అంటూ తెగ కామెంట్లు చేస్తున్నారు.ఇక ఈ సినిమా ఒరిజినల్ వెర్షన్.. డైరెక్టర్ కమ్ యాక్టర్ సముద్రఖని స్వీయ దర్శకత్వంలో తెరకెక్కింది. తమిళంలో సూపర్ హిట్ గా నిలిచిన ఈ చిత్రంలో సముద్రఖని నటించిన పాత్రలోనే పవన్ మోడర్న్ గాడ్ గా నటించారు. తంబి రామయ్య అనే మరో కీలక పాత్రలో భక్తుడిగా సాయి ధరమ్ తేజ్ కనిపించారు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ జీ స్టూడియోస్ సంయుక్తంగా కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ సినిమాలో కేతిక శర్మ,ప్రియా ప్రకాష్ వారియర్, తనికెళ్ళ భరణి, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మాస్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని జులై 27న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నారు.

# పుష్ప-2 యాక్షన్ సన్నివేశాలు అదుర్స్

### విశాఖ పోర్టులో తెరకెక్కిన విషయాలపై చర్చ



పుష్ప చిత్రంలో అల్లు అర్జున్ మేనరిజం, యాటిట్యూడ్, డైలాగ్ డెలివరీ అంతే ఆకర్షణగా నిలిచాయి. ఇప్పుడు ఆ సీన్‌కు మించి ఆకట్టుకునే సన్నివేశాలు 'పుష్ప-2' కోసం తెరకెక్కిస్తున్నారు దర్శకుడు సుకుమార్. ఇటీవల వైజాగ్‌లో తెరకెక్కించిన సన్నివేశాల గురించి ఆసక్తికర విషయాలు బయటికొచ్చాయి.ఇటీవల వైజాగ్ పోర్ట్‌లో జరిగిన షూటింగ్‌లో అల్లు అర్జున్‌పై భారీ యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కించారు. దీని కోసం జర్మనీ నుంచి 50 మంది స్టంట్ ఆర్టిస్ట్‌లను దింపారు. ప్రతినాయకుడి బృందం పుష్పరాజ్‌పై తిరగబడే సన్నివేశాలను భారీగా రూపొందించారు. పోర్ట్‌లో భారీ క్రేన్ సాయంతో వంద అడుగులు ఎత్తులో తల కిందులుగా అల్లు అర్జున్‌ని వేలాడదీసే సన్నివేశాన్ని చిత్రీకరించారు. జర్మనీ నుంచి వచ్చిన 50 మంది ఫైటర్స్ ఈ సన్నివేశంలో పాల్గొన్నారు. ఇక్కడో మరో ఆసక్తికర విషయం ఉంది. వంద అడుగుల ఎత్తులో తలకిందులుగా వేలాడదీసిన పుష్పరాజ్ అక్కడ కూడా తన మేనరిజాన్ని వదల్లేదు. అంత ఎత్తులో కూడా 'ఈ కాలు నాదే.. ఈ కాలు నాదే.. నా కాలు మీద నా కాలు ఏసుకుంటిని' అన్నట్లు గాల్లో కూడా కాలు మీద కాలు వేసుకుని వేలాడుతున్నాడు. చిత్ర బృందం అంతా ఇప్పుడు ఈ సన్నివేశం గురించే ఎక్కువ చర్చించుకుంటున్నారు. ఒక కాలు మడిచి ఉండగా మరో కాలికి తాడు కట్టి వేలాడదీయడం అంటే ఆషామాషీ విషయం కాదు. బన్నీ ఇలాంటి రిస్క్ షాట్‌లకు కూడా వెనకాడకుండా, డూప్ లేకుండా చేశాడని చిత్ర బృందం చెబుతోంది. సినిమా ఈ సీన్ సూపర్‌గా పేలుతుందని చెబుతున్నారు. పుష్ప చిత్రంలో మరో ఫేమస్ డైలాగ్ 'పార్టీ లేదా పుష్ప'? ఇది ఎంతగా వైరల్ అయిందో తెలిసిందే. పుష్ప రాజ్ పార్టీ ఇచ్చే సమయం వచ్చింది. ఇప్పుడు ఆ సన్నివేశాలనే తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో ప్లాన్ చేశారు. నాలుగు రోజుల క్రితం ప్రగతి రీసార్ట్‌లో పార్టీ అట్మాస్పియర్ క్రియేట్ అయ్యేలా ఓ పెద్ద సెట్ వేశారు. అక్కడ పుష్పరాజ్ పార్టీ ఇచ్చే సన్నివేశాలను తెరకెక్కించాలని దర్శకుడు ప్లాన్ చేశారు. అదే రోజు గాలులతో కూడా భారీ వర్షం రావడంతో పార్టీ సెట్ మొత్తం ధ్వంసం అయింది. దాంతో ఆ రోజు షూటింగ్ క్యాన్సిల్ అయింది. ప్రస్తుతం నైట్‌లైట్‌లో ఆ సన్నివేశాలు తెరకెక్కించే పనిలో 'పుష్ప-2' బృందం ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తానికి పార్ట్ వన్ బ్లాక బస్టర్‌తో 'పుష్ప-2'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. దాంతో అంతకుమించి 'పుష్ప-2' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు సుకుమార్. రష్మిక మందన్నా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీమేకర్స్ సంస్థ నిర్మిస్తోంది.

## జోస్ బట్లర్‌తో రాయల్స్ దీర్ఘకాల ఒప్పందం

### బ్రిటన్ పత్రిక 'టెలిగ్రాఫ్' కథనం వెల్లడి




న్యూఢిల్లీ,జూన్29(ఆర్ఎన్ఎ): ఐపీఎల్ 16వ సీజన్‌కు ముందు రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ కీలక నిర్ణయం తీసుకుంది. తమ జట్టు విధ్వంసక ఆటగాడు జోస్ బట్లర్ తో దీర్ఘకాల ఒప్పందం చేసుకునేందుకు సిద్ధమవుతోంది. అవును.. ఈ విషయాన్ని బ్రిటన్ పత్రిక 'టెలిగ్రాఫ్' గురువారం ప్రచురించింది. 'ఇంగ్లండ్ వన్డే, టీ20 కెప్టెన్ జోస్ బట్లర్‌కు ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్ జట్టు నాలుగేళ్ల కాంట్రాక్టు ఆఫర్ చేయనుంది. అయితే.. అతడికి ఎంత డబ్బు ముట్టజెప్పనుంది అనేది తెలియదు. అంతేకాదు.. రాజస్థాన్ ఆఫర్‌కు బట్లర్ ఒప్పుకుంటాడా? లేదా? అనేది కూడా తెలియాల్సి ఉంది' అని తన రిపోర్టులో టెలిగ్రాఫ్ వెల్లడించింది. బట్లర్‌తో డీల్ రూ. కోట్లలో ఉండనుందని టాక్. అయితే.. ఈ విషయాన్ని రాజస్థాన్ ఫ్రాంచైజీ మాత్రం అధికారికంగా వెల్లడించలేదు. ప్రపంచంలోని మేటి క్రికెటర్లలో ఒకడైన బట్లర్ ఆట గురించి తెలిసిందే. క్రీజులో అడుగుపెట్టిందే ఆలస్యం ఈ చిచ్చరపిడుగు బౌలర్లపై విరుచుకుపడుతాడు. ఐపీఎల్ లోనూ బట్లర్ తనదైన శైలిలో మరుపురాని ఇన్నింగ్స్‌లు ఆడాడు. 2018లో రాజస్థాన్ జట్టు అతడిని రూ.4.4 కోట్లకు కొనుగోలు చేసింది. యాజమాన్యం తనపై పెట్టుకున్న నమ్మకాన్ని ఈ ఇంగ్లండ్ కెప్టెన్ వమ్ము చేయలేదు. 2022 సీజన్ లో బట్లర్ ఆకాశామే హద్దుగా చెలరేగి జట్టును ఫైనల్‌కు చేర్చాడు. అయితే.. 16వ సీజన్‌లో ఎక్కువ పరుగులు సాధించలేకపోయాడు. కేవలం రెండు అర్ధ సెంచరీలతో నిరాశపరిచాడు. ఇప్పటి వరకు రాజస్థాన్ తరఫున బట్లర్ 5 సెంచరీలు, 17 అర్ధ శతకాలు బాదాడు. నిరుడు ఫైనలిస్ట్ అయిన సంజూ శాంసన్ సేన ఈసారి ప్లే ఆఫ్స్‌కు చేరలేకపోయింది. యంగ్ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ మెరపులు మెరిపించినా కీలక ఆటగాళ్లు రాణించలేదు. దాంతో, రెండోసారి ఫైనల్ చేరాలనుకున్న ఆ జట్టు కల కలగానే మిగిలింది.

# ద్రవిడ్ రికార్డును బ్రేక్ చేసిన స్మిత్

### టెస్ట్ క్రికెట్‌లో 9వేల పరుగులు పూర్తి



లార్డ్స్,జూన్29 : యాషెస్ సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్ మ్యాచ్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా సీనియర్ బ్యాటర్ స్టీవ్ స్మిత్.. టీమిండియా హెడ్ కోచ్ రాహుల్ ద్రావిడ్ రికార్డును బద్దలు కొట్టాడు. ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ వేసిన 42వ ఓవర్లో బౌండరీ బాదడం ద్వారా టెస్ట్ క్రికెట్‌లో స్టీవెన్ స్మిత్ 9 వేల పరుగులను పూర్తి చేసుకున్నాడు. దీంతో టెస్ట్ క్రికెట్‌లో వేగంగా 9 వేల పరుగులను పూర్తి చేసిన రెండో ఆటగాడిగా స్మిత్ రికార్డు నెలకొల్పాడు. ఆస్ట్రేలియా తరఫున మొదటి బ్యాటర్‌గా నిలిచాడు. కాగా స్మిత్ 174 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ రికార్డు సాధించాడు. ఈ క్రమంలో 176 ఇన్నింగ్స్‌ల్లో 9 వేల పరుగులు పూర్తి టీమిండియా మాజీ ఆటగాడు, ప్రస్తుత టీమిండియా హెడ్ కోచ్ రాహుల్ ద్రావిడ్ రికార్డును స్మిత్ బ్రేక్ చేశాడు. కాగా 172 ఇన్నింగ్స్‌ల్లోనే 9 వేల పరుగులను పూర్తి చేసిన శ్రీలంక మాజీ ఆటగాడు కుమార సంగక్కర ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉన్నాడు. కాగా స్టీవెన్ స్మిత్ తన 99వ టెస్ట్ మ్యాచ్‌లో ఈ రికార్డును అందుకోవడం గమనార్హం. ఈ ఇన్నింగ్స్‌లో స్మిత్ మరో రికార్డును కూడా అందుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి 15,000 పరుగులను పూర్తి చేసుకున్నాడు. దీంతో వేగంగా 15 వేల పరుగులను పూర్తి చేసిన ఆటగాళ్ల జాబితాలో స్మిత్ ఏడో స్థానంలో నిలిచాడు. కాగా స్మిత్ 351 ఇన్నింగ్స్‌లో ఈ రికార్డును అందుకున్నాడు. ఇప్పటివరకు టెస్ట్‌ల్లో 9054 పరుగులు చేసిన స్మిత్, వన్డేల్లో 4,939.. టీ20ల్లో 1008 పరుగులు చేశారు. కాగా 333 ఇన్నింగ్స్‌ల్లోనే 15 వేల పరుగులు పూర్తి చేసిన టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉన్నాడు. అలాగే ఆస్ట్రేలియా లెజెండ్ స్టీవ్ వా టెస్టు సెంచరీల రికార్డును అతను సమం చేశాడు. అలాగే.. ఆసీస్ తరఫున అత్యధిక శతకాలు బాదిన రెండో ఆటగాడిగా స్మిత్ పేరు తెచ్చుకున్నాడు. జాబితాలో మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ 41సెంచరీలతో అగ్రస్థానంలో ఉన్నాడు. అంతేకాదు వేగంగా 32 సెంచరీలు కొట్టిన తొలి క్రికెటర్‌గా స్మిత్ మరో ఘనత సాధించాడు. 99వ టెస్టు ఆడుతున్న ఈ స్టార్ ప్లేయర్ 174 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఫీట్ సొంతం చేసుకున్నాడు. ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో స్మిత్ వంద కొట్టిన విషయం తెలిసిందే. రెండో టెస్టులోనూ అతను తన ఫామ్ కొనసాగించాడు. రెండో టెస్టులో.. ఓవర్ నైట్ స్కోర్ 85తో రెండో రోజు క్రీజులోకి వచ్చిన స్మిత్ వేగంగా ఆడాడు. అండర్సన్ బౌలింగ్‌లో కవర్ డ్రైవ్‌తో బౌండరీ కొట్టి వందకు చేరువయ్యాడు. అయితే.. వేగంగా ఆడే క్రమంలో జోష్ టంగ్ ఓవర్లో బెన్ డకెట్ చేతికి చిక్కి ఔటయ్యాడు. రాబిన్సన్ మూడు, రూట్ రెండేసి వికెట్లతో చెలరేగడతో తొలి సెషన్‌లోనే ఆసీస్ 416 పరుగులకే కుప్పకూలింది.

# సెహ్వాగ్ స్పెషల్ బ్యాట్స్ ప్రదర్శన

### ఇన్‌స్టాలో సెంచరీలు బాదిన బ్యాట్స్





న్యూఢిల్లీ,జూన్29(ఆర్ఎన్ఎ): టీమిండియా మాజీ ఆటగాడు వీరేంద్ర సెహ్వాగ్ దూకుడు ఆటకు పెట్టింది పేరు. అతని పేరుతో అనేక రికార్డులు ఉన్నాయి. తన కెరీర్లో ఆడిన అత్యున్నత ఇన్నింగ్స్‌లకు సంబంధించిన బ్యాట్‌లను తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేశాడు. ట్రిపుల్ సెంచరీలు, డబుల్ సెంచరీలు, సెంచరీలు కొట్టడానికి ఉపయోగించిన బ్యాట్‌లను సెహ్వాగ్ అభిమానులతో పంచుకున్నాడు. పాకిస్థాన్‌పై ట్రిపుల్ సెంచరీ, సౌతాఫ్రికాపై ట్రిపుల్ సెంచరీ, పాకిస్థాన్‌పై డబుల్ సెంచరీ, సెంచరీ కొట్టిన బ్యాట్‌లతోపాటు వన్డే క్రికెట్లో వెస్టిండీస్‌పై డబుల్ సెంచరీ కొట్టిన బ్యాట్‌లను సెహ్వాగ్ పోస్ట్ చేశాడు. అంతేకాకుండా శ్రీలంకపై ట్రిపుల్ సెంచరీ చేజార్చుకున్న బ్యాట్‌ను సెహ్వాగ్ తిప్పి ఉంచాడు. దానికి 'బ్యాట్ మే హై దమ్ - 309, 319, 219, 119, 254. ప్యారే సాథీ. లాస్ 293 వాలా క్రికెట్' అని రాశాడు. ప్రస్తుతం సెహ్వాగ్ చేసిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అంతర్జాతీయ క్రికెట్‌లో ట్రిపుల్ సెంచరీ చేసిన మొదటి భారత ఆటగాడు వీరేంద్ర సెహ్వాగ్. సెహ్వాగ్ ఇప్పటివరకు రెండు ట్రిపుల్ సెంచరీలు కొట్టాడు. కాగా సెహ్వాగ్ తన మొదటి ట్రిపుల్ సెంచరీని (309) 2004లో పాకిస్థాన్‌పై కొట్టాడు. 2008లో సౌతాఫ్రికాపై మరో ట్రిపుల్ సెంచరీ (319) కొట్టాడు. 2009లో శ్రీలంకపై 293 పరుగులు చేసి తృటిలో ట్రిపుల్ సెంచరీని చేజార్జుకున్నాడు. ఆ మ్యాచ్‌లో కనుక సెహ్వాగ్ ట్రిపుల్ సెంచరీ కొట్టి ఉంటే అంతర్జాతీయ క్రికెట్‌లో మూడు ట్రిపుల్ సెంచరీలు కొట్టిన ఒకే ఒక్కడిగా నిలిచిపోయేవాడు. ఈ క్రమంలోనే ఆ బ్యాట్‌ను తిప్పి ఉంచిన సెహ్వాగ్.. లాస్ 293 వాలా అని రాసుకొచ్చాడు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092,PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com